www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
18 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 223

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## 73.39 లక్షల ఓట్లు గల్లంతు!

- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- 2.64 కోట్ల మంది ఎన్యుమరేషన్ పూర్తి
- 73.39 లక్షల ఎంట్రీలు తాత్కాలిక తొలగింపు
- రాష్ట్రవ్యాప్తంగా 36,353 పోలింగ్ కేంద్రాలు
- సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాల గడువు
- అక్టోబర్ 19న తుది జాబితా ప్రచురణ

02



## రైతులకు ఏటా కన్నీళ్లే!

- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో తీవ్ర సాగునీటి కొరత
- జూరాలకు భారీ వరద వచ్చినా నిల్వ చేయలేని వైనం
- 190 టీఎంసీల్లో 175.5 టీఎంసీలు దిగువకు విడుదల
- రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తి చేయని వైనం
- 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందని నీరు
- కేటాయింపులు ఉన్నా వృథా అవుతున్న వైనం

02

## తెలంగాణ బీజేపీకి దక్కని చోటు!


- బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం ప్రకటన
- ఉపాధ్యక్ష పదవి దక్కించుకున్న పురందేశ్వరి
- జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ
- జాయింట్ కోఆర్డినేటర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి
- కోశాధికారిగా బాధ్యతలు చేపట్టిన పీయూష్ గోయల్
- తెలంగాణకు దక్కని జాతీయ కార్యవర్గ ప్రాతినిధ్యం

03



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన సొంత పార్టీలో కొత్త కుంపటి రాజేసింది. సీఎం పర్యటన వల్ల ప్రభుత్వానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి ఒనగూరిన ప్రయోజనమెంతోగానీ, ఆ పార్టీలో అంతర్గతంగా పరకాల నియోజకవర్గం చుట్టూ నెలకొన్న రాజకీయ వర్గపోరుకు తెరదించారా లేక కొత్తగా తెరలేపారా అనే ఆసక్తికరమైన చర్చ రాజకీయవర్గాల్లో షురువైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మరోసారి గెలుస్తారని వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీచేస్తారంటూ సీఎం రేవంత్ ప్రకటించడం ఒక సాధారణ సానుకూల ప్రకటనగానే కనిపిస్తున్నప్పటికీ నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న ప్రత్యేకతల రీత్యా సొంత పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. వరంగల్ కాంగ్రెస్ పార్టీలో సీఎం ప్రకటన కుంపటి రాజేసిందని కొందరు భావిస్తుండగా అంతర్గతంగా ఉన్న విభేదాలకు తెరదించుతూ స్పష్టమైన ప్రకటన చేశారంటూ మరి కొందరు భావిస్తున్నారు. సీఎం ప్రకటన రేవూరి వర్గంలో సంతోషాన్ని నింపగా కొండా వర్గంలో నిరాశ కనిపిస్తున్నది. కొందరు నాయకులు అవకాశవాదంతో వ్యవహరించినా నియోజకవర్గంలో పార్టీని కాపాడింది తానేనంటూ ఇనుగాల తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# పరకాల గడ్డపై మూడు ముక్కలాట!



- పరకాల వేదిక పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- రేవూరి ప్రకాష్ రెడ్డి మరోసారి పోటీ ప్రకటన
- కొండా దంపతులు, రేవూరి మధ్య ఆధిపత్య పోరు
- ఇనుగాల గైర్హాజరుతో కలకలం
- పార్టీలో మూడు ముక్కలాటగా మారిన రాజకీయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పరకాలలో సీఎం రేవంత్ ప్రకటన పై భిన్న రకాల చర్చలు సాగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి మరోసారి పోటీచేసే చాన్సు అది కూడా ఇంకా ఎన్నికలు రెండేళ్ళ ముందే ప్రకటన చేస్తే ఇంత రాజకీయ వివాదానికి రాద్ధాంతానికి ఎందుకు కారణమవుతోందంటూ భిన్న చర్చసాగుతోంది. అసలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈ పరకాల గడ్డ అడ్డా కథేంటనే చర్చ సాగుతోంది. ఈ కథ వెనుక కారణాలను ఒకసారి పరిశీలిద్దాం. తెలంగాణ ప్రజల అనేక పోరాటాలు వందలాది మంది త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. 2014లో అప్పటి యుపీఎ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని ప్రత్యేక రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చుకోవడంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మూకుమ్మడిగా విఫలమైంది. దీనికి కాంగ్రెస్ అధిష్టానం అనుసరించిన వైఖరి కూడా కారణమనే అభిప్రాయం ఆ పార్టీలో కూడా ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని తెలంగాణ ఉద్యమ


మిగతా 3లో..



## అల్ట్రా లగ్జరీ హబ్ కోకాపేట!

- జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌కు కాలం చెల్లుతోంది
- కోకాపేట్ వైపు భాగ్యనగర సంపన్నుల చూపు
- రూ. 100 కోట్లు దాటిన నియోపోలిస్ భూముల ధర
- ఆకాశహర్మ్యాలతో మారుతున్న నగర స్కైలైన్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెరుగైన కనెక్టివిటీ
- రియల్ ఎస్టేట్ రంగంలో నయా రాచబాట

03



## కేవలం 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష

- యూపీ కోర్టు సంచలన తీర్పులు
- దోషులకు ఊచలు లెక్కపెట్టే శిక్షను నో ఛాన్స్.. మరణశిక్ష ఖరారు

02

## పోరుకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

- 2వ పీఆర్సీ అమలుకు టీజీఈ-జేఏసీ సిద్ధం
- 6 డీఏ బకాయిల కోసం నేడు కీలక సమావేశం
- నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో ఉదయం 11 గంటలకు భేటీ
- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ఇవ్వాలని డిమాండ్
- కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ అమలుపై చర్చ
- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యాక్షన్ ప్లాన్

02

## రేవంత్.. నీకు దమ్ముంటే నా పేరెత్తి మాట్లాడు!

- రేవంత్ రెడ్డి నా పేరు చెప్పి ఆరోపణలు చేయాలి
- లీగల్ నోటీసులకు, చట్టానికి నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నా
- రేవంత్ పాలన కుటుంబ పాలనగా మారిపోయింది
- కల్యాణ లక్ష్మి దరఖాస్తులు లక్షకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి
- తెలంగాణ తెచ్చింది కేసీఆర్ కాబట్టి రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు
- దేవుడి దర్శనానికీ వెళ్తే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు

02



## టిమ్స్‌ని ప్రారంభించిన సీఎం రేవంత్

- సనత్‌నగర్‌లో అత్యాధునిక టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం
- మొత్తం 22.6 ఎకరాల విస్తీర్ణంలో ఐదు బ్లాకుల నిర్మాణం
- మొదటి విడతలో 582 పడకల వైద్య సేవల అందుబాటు
- నిమ్స్ తరహాలో ప్రత్యేక స్వయం ప్రతిపత్తి హోదా కల్పన
- నాలుగు ప్రధాన విభాగాలతో పాటు 37 ప్రత్యేక విభాగాలు
- సుమారు 200 మంది నిపుణులైన వైద్య సిబ్బంది కేటాయింపు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వ ప్రజారోగ్య మౌలిక వసతుల్లో టిమ్స్ ఆసుపత్రి సేవలు మరో కీలక అధ్యాయం కానున్నాయి. అధునాతన, అందుబాటు ధరల్లో సమగ్ర సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే ప్రతిష్ఠాత్మక సంస్థగా టిమ్స్ నిలవనుంది. మొత్తం 22.6 ఎకరాల్లో ఐదు బ్లాకులతో ఆసుపత్రిని నిర్మించారు. అత్యాధునిక వసతులతో సిద్ధమైన టిమ్‌స్‌లో సుమారు

మిగతా 3లో..



## సీఎం విజయ్ సెంచరీ కొట్టేశారు

- 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సీఎం విజయ్
- వివాహ కానుకగా పట్టు చీరలు, బంగారు నాణెం పథకాల ప్రకటన
- ప్రతి రెండు నెలలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు

06

## 22ఎ వల్ల గజం భూమిని కూడా పోనివ్వం!

- 22ఎ బాధితులకు పూర్తి న్యాయం
- ఈ నెలాఖరులోగా దరఖాస్తుల పరిష్కారం
- సబ్ రిజిస్ట్రార్‌లకు పహాణీల యాక్సెస్
- ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు
- సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- అధికారులతో హైపవర్ కమిటీ నియామకం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** 22ఎ వల్ల నిజమైన హక్కుదారులకు చెందిన గజం భూమిని కూడా పోనివ్వమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ కోసం అప్లై చేసుకున్నవారి భూమి నిషేధిత జాబితాలో ఉంటే మొదటి ప్రాధాన్యంతో పరిష్కరించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఓవైపు ప్రభుత్వ భూములను రక్షిస్తూ సామాన్యులకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి,

మిగతా 2లో..



## చిన్నారెడ్డి.. మరో జీవన్ రెడ్డి

- వనపర్తి కాంగ్రెస్‌లో అంతర్గత పోరు రగులుతోంది
- చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు
- మేఘారెడ్డి పై తీవ్ర విమర్శలు వచ్చాయి
- మంత్రులు కూడా అంగీకరించినట్లు వెల్లడించారు
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాటలో హెచ్చరిక
- బీఆర్ఎస్‌లో నిరంజన్ రెడ్డి బలమైన నాయకుడు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు మరోసారి తీవ్రస్థాయిలో రోడ్డున పడుతున్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత అలాగే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డిని లక్ష్యంగా చేసుకుని సంచలన ఆరోపణలు చేశారు. మేఘారెడ్డి భారీగా డబ్బులు చెల్లించి పార్టీ టికెట్ కొనుక్కున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోవడానికి అలాగే కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడటానికి ఎమ్మెల్యే వైఖరే ప్రధాన కారణమని ఆయన వ్యాఖ్యానించారు. స్థానిక నేతల మధ్య రాజుకున్న ఈ అధిపత్య పోరు ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి అనుసరిస్తున్న విధానాల వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర మంత్రులే తన వద్ద అంగీకరించారని

మిగతా 3లో..

# రేవంత్.. నీకు దమ్ముంటే నా పేరెత్తి మాట్లాడు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న స్కాములను నేను ఆధారాలతో సహా బయటపెడుతుంటే సమాధానం చెప్పలేక రేవంత్ రెడ్డి నా మీద వ్యక్తిగతంగా కక్ష కడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రికి నిజంగా దమ్ముంటే నా పేరు చెప్పి ఆరోపణలు చేయాలని డిమాండ్ చేశారు. నా పేరు చెబితే వెంటనే లీగల్ నోటీసు పంపుదామని తాను రెడీగా ఉన్నానని చెప్పారు. లీగల్ నోటీసులకు, చట్టానికి భయపడే ఆయన నా పేరు చెప్పకుండా పిరికివాడిలా మాట్లాడుతున్నాడని తీవ్రంగా ఎద్దేవా చేశారు. రేవంత్ తీరు ఫోర్ బ్రదర్స్ పాలనగా మారిపోయిందని ఆరోపించారు. ఆయన సొంత మనుషులకే జస్టిస్ జరుగుతోందని సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే నైతిక అర్హత రేవంత్ రెడ్డికి అసలు లేదని ఆయన స్పష్టం చేశారు. నాడు తెలంగాణ కోసం నిస్వార్థంగా కొట్లాడి తన మీద 370 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మెదక్ జైల్లో మూడు రోజులు ఉన్నానని, రైలు రోకోలో 48 గంటలు కంకర రాళ్ల మీదే పడుకున్నానని గుర్తుచేశారు. ఎమ్మెల్యే పదవులను గడ్డిపోచలా విసిరికొట్టి ఉద్యమం చేశామని చెప్పారు. మిలియన్ మార్చ్ సమయంలో తనకు ఈత రాకపోయినా తెలంగాణ కోసం హుస్సేన్ సాగర్‌లోకి దూకానని తెలిపారు. రేవంత్ పాలన కుటుంబ పాలనగా, ఫోర్ బ్రదర్స్ పాలనగా పూర్తిగా మారిపోయిందని ధ్వజమెత్తారు. పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుడుతున్నా సంక్షేమ నిధులు అందడం లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 35 నుంచి 51 వరకు స్పష్టంగా చెబుతున్నది ఏంటంటే సంక్షేమం అనేది రాజ్యం ప్రాథమిక విధి అని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ అధికారంలోకి రాగానే ఏకంగా 42 సంక్షేమ పథకాలకు ఒకేసారి ఆమోదముద్ర వేశారని పేర్కొన్నారు.



ఎన్నికల మేనిఫెస్టోలో ముందుగా చెప్పకపోయినా ఆడబిడ్డలకు అండగా ఉండాలనే బాధ్యతతో అధికారంలోకి రాగానే కల్యాణ లక్ష్మిని తెచ్చి అమలు చేశామని చెప్పారు. పక్క రాష్ట్రం తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ 100 రోజుల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు 8 గ్రాముల బంగారం ఇస్తామని మాట ఇచ్చి అమలు చేస్తున్నారని తెలిపారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం కల్యాణ లక్ష్మి దరఖాస్తులు లక్షకుపైగా పెండింగ్‌లో మూలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇస్తుందని నాడు స్వయంగా కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ట్వీట్ చేశారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తవి ఇవ్వకపోగా లక్షా 40 వేల రేషన్ కార్డులను తొలగించి పేదల కడుపు కొట్టారని విమర్శించారు. సీలింగ్ ఎత్తివేసి ప్రతి ఒక్కరికీ 6 కేజీల బియ్యం ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రజలకు తెలుసన్నారు. ఉద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. గత మూడు నెలలుగా జీతాల నుంచి ఈహెచ్ఎస్ డబ్బులు కట్ చేస్తున్నారని, ఆ కార్డు పట్టుకుంటే ఏ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని తెలిపారు. సిద్దిపేటలో రిటైర్డ్ హెడ్మాస్టర్ భార్య అపోలో ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందుతూ చనిపోతే 11 లక్షల బిల్లు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈహెచ్ఎస్ వర్తించక బిల్లు తగ్గించమని ఆయన తన దగ్గరకు వచ్చి వేడుకున్న పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోయిందని చెప్పారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కాంట్రిబ్యూషన్ లేకుండానే జర్నలిస్టులను సైతం ఈహెచ్ఎస్‌లో చేర్చిందని గుర్తుచేశారు. సిద్దిపేట మెడికల్ కాలేజీలో రివ్యూ చేస్తే 2023 నవంబర్ నుంచి 24 కోట్ల రూపాయల ఆరోగ్య శ్రీ నిధులు రాలేదని సూపరింటెండెంట్ చెబుతున్నారని తెలిపారు. పోలీసుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని, వాళ్లకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ బంద్ అయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 33 కార్పొరేషన్లకు 14,500 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పి ఇప్పటివరకు ఖర్చు చేసింది కేవలం 305 కోట్లు మాత్రమేనని హరీశ్ రావు ఎత్తిచూపారు. బీసీ కార్పొరేషన్‌లో ఖర్చు చేసింది కేవలం 6 కోట్లు మాత్రమేనని చెప్పారు. చైర్మన్ల పదవీకాలం అయిపోతున్నా ఒక్క స్కీమ్ కింద పైసా ఇవ్వలేదన్నారు. అసలు నాడు కేసీఆర్ ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ రాష్ట్రం సాధించారు కాబట్టే నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోగలిగారని అన్నారు. అదే కేసీఆర్ తెలంగాణ తేకపోతే రేవంత్ రెడ్డి ఇవాళ యనమల రామకృష్ణుడు కాళ్లకాడ కూర్చునేవాడని విమర్శించారు. కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. నాపై తప్పుడు ప్రచారాలు చేసి రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి ఏదో ఒక అంశంపై తన మీద దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని, ఆయన కేసీఆర్‌ను విమర్శించడం అంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని అన్నారు. దళితులకు, గిరిజనులకు, బీసీలకు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అంతా చెత్తబుట్ట దాఖలైందని, బడ్జెట్‌లో గొప్పలు చెప్పడమే తప్ప రూపాయి విడుదల చేయడం లేదన్నారు. దళితబంధు కింద 2 వేల కోట్లు బడ్జెట్లో పెట్టి ఒక్క రూపాయి కూడా రిలీజ్ చేయలేదని విమర్శించారు. దేవుడు కనపడితే భక్తితో దండం పెట్టుకోవడం తనకు మొదటి నుంచీ ఉన్న అలవాటని తెలిపారు. కానీ దేవుడి పేరుతో కూడా చిల్లర రాజకీయం చేయడం ఒక్క రేవంత్ రెడ్డికే తెలిసిన విద్యని విమర్శించారు. గుడికి వెళ్తే దేవుడికి దండం పెట్టుకుంటారని, తాను ఆధ్యాత్మిక భావనతో తమిళనాడులోని శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి వెళ్లానని చెప్పారు. కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా అమ్మవారి టెంపుల్‌కు వెళ్లడం కోసం శివమొగ్గ ఎయిర్‌పోర్టుకు వెళ్లానని స్పష్టం చేశారు. దేవుడి దర్శనం కోసం గుడికి వెళ్లడం కూడా ముఖ్యమంత్రికి తప్పుగా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లినప్పుడు ఇంటెలిజెన్స్, పోలీస్ అధికారులు తనను గుర్తుపట్టి ఫోటోలు తీసుకున్నారని తెలిపారు. అయితే తాను అక్కడ ఎవరో పూజలు చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను నిజంగా అలాంటి పూజలు చేసినట్లు ముఖ్యమంత్రి దగ్గర ఆధారాలు ఉంటే తక్షణమే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన మీద బురదజల్లి వ్యక్తిగత ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలనే కుట్రతోనే ఈ పూజల డ్రామా ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానుకోటలో బుల్లెట్లు పడుతుంటే రక్తపు మడుగులో ఉన్నవారిని తన భుజాలపై ఎత్తుకుని ఆసుపత్రికి పరుగెత్తానని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో వందల సార్లు ఢిల్లీ హైకోర్టు చుట్టూ తిరిగిన చరిత్ర తనదని చెప్పారు. తన పోరాటాన్ని, త్యాగాలను చూసి ప్రజలు ఈ రాష్ట్రంలో ఎవరికీ రానంత మెజార్టీతో ఏకంగా లక్షా 20 వేల ఓట్లతో గెలిపించారని హరీశ్ రావు పేర్కొన్నారు.

## 22ఎ వల్ల గజం భూమిని కూడా పోనివ్వం!

**మొదటి పేజీ తరువాయి**

సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 22ఎ సమస్యలు, పరిష్కార మార్గాలపై దిశానిర్దేశం చేశారు. సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారిగా ఉంటుంది. 22ఎ ను భూతంగా చూపించి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదు. 22ఎ కు సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, ఈ నెలాఖరులోగా పరిష్కరించాలి. సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎవరికీ లేదు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, కావాలని జాప్యం చేయడం, చిన్న సమస్యను పెద్ద సమస్యగా మారిస్తే ఇకపై సహించేది లేదు. ప్రజల సమస్యను పరిష్కరించడం అధికారులుగా మీ బాధ్యత. నిజమైన భూ హక్కుదారుడికి న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. ఈ రెండింటిలో ఏ ఒక్కదానిని అధికారులు నిర్లక్ష్యం చేసినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. 22ఎ లో భూమి ఉందనే ఒక్క కారణంతో ప్రజలను తిరస్కరించకూడదు. ఆ భూమి ఎందుకు నిషేధిత జాబితాలోకి వచ్చింది, సంబంధిత రికార్డులు ఏమి చెబుతున్నాయో, వాస్తవ పరిస్థితి ఏమిటో సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. ఇప్పటివరకు మొత్తం 757 మంది 22ఎ కు సంబంధించి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఇచ్చిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు తదితర రికార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. సబ్ రిజిస్ట్రార్‌లకు పహాణి యాక్సెస్ కూడా ఇచ్చాం. రికార్డులను పరిశీలించి జెన్యూన్ కేసులను వెంటనే పరిష్కరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. ఇందుకోసం అవసరమైతే



స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలి. కార్యాలయాల పని వేళలు కూడా పెంచాలి. రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని కేసుల్లో ఎందుకు చేయలేమో ప్రజలకు స్పష్టమైన కారణం చెప్పాలి. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లయితే నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాలి. గతంలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అప్పట్లో అధికారులు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను వదిలేయడంతో అవి నేటికీ కొనసాగుతూ నిషేధిత జాబితాలో ఉండిపోయినందున అధికారుల చర్యలతో సామాన్యులు కూడా ఇబ్బందిపడ్డ మాట వాస్తవం. భూదాన్, దేవాదాయ, ఫారెస్ట్ భూముల పక్కన ఉండి ఒకే సర్వే నంబర్ ఉండటం వల్ల కూడ కొన్ని ప్రైవేటు భూములు నిషేధిత జాబితాల్లోకి వెళ్లాయి, వాటి గుర్తించి క్లియర్ చేస్తాం. ఇద్దరు అధికారులతో ఈ 22ఎ సమస్యను మొత్తాన్ని పరిష్కరించేలా ఉన్నత స్థాయి కమిటీ వేస్తున్నాం. సందేహాల నివృత్తి కోసం, సమస్యలు తెలపడానికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ 18005994788 నంబరు ఏర్పాటు చేశాం అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవో, సబ్ రిజిస్టర్లు పాల్గొన్నారు.

# పోరుకు సిద్ధమవుతున్న ఉద్యోగులు


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ మరోసారి పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ డిమాండ్ల సెగ గట్టిగా తగిలేలా కార్యాచరణను రూపొందించేందుకు ఉద్యోగ సంఘాలు నడుం బిగించాయి. ఇందులో భాగంగానే తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పదకొండు గంటలకు హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో ఉన్న ప్రతిష్టాత్మకమైన టీఎన్జీవో భవన్‌లో ఒక అత్యంత కీలకమైన సమావేశం జరగనుంది. ఈ విస్తృత స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అంశాలపై లోతుగా చర్చించనున్నారు. పాలకవర్గం నుంచి సానుకూల స్పందన రాకపోతే భవిష్యత్తులో చేపట్టబోయే తీవ్రమైన ఆందోళన కార్యక్రమాల రూపురేఖలను ఈ వేదికపై పూర్తిగా ఖరారు చేయనున్నారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని నేతలు ఈ భేటీ ద్వారా స్పష్టంగా తెలియజేయనున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉండిపోయిన ఆర్థికపరమైన ప్రధాన డిమాండ్లపై ఈ సమావేశంలో అత్యధికంగా ఫోకస్ చేయనున్నారు. రెండవ పే రివిజన్ కమిటీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి జాప్యం చేయకుండా వెంటనే అమలు చేయాలన్నదే ఉద్యోగుల మొదటి మరియు ముఖ్యమైన డిమాండ్‌గా ఉంది. దీనికి తోడుగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు మరియు ద్రవ్యోల్బణం విపరీతంగా పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి పట్టించుకోకుండా పెండింగ్‌లో పెట్టిన ఆరు కరవు భత్యం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సంఘాల నేతలు తీవ్రంగా పట్టుబడుతున్నారు. ఆర్థికపరమైన ఈ కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం ఉద్యోగులలో తీవ్ర ఆగ్రహానికి ప్రధాన కారణమవుతోంది. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వంపై నైతిక ఒత్తిడిని మరింత పెంచడమే లక్ష్యంగా నేతలు పక్కా వ్యూహాలు రచిస్తున్నారు. పెండింగ్ బకాయిలన్నీ ఒక్కసారిగా విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులను ఏకం చేసి పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపట్టాలని సంఘాలు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఆర్థిక డిమాండ్లతో పాటు ఉద్యోగుల సామాజిక భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలపై కూడా టీజీఈజేఏసీ తీవ్రంగా చర్చిస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను సంపూర్ణంగా రద్దు చేసి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ఉద్యోగ వర్గాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యంగా రెండు వేల నాలుగో సంవత్సరం సెప్టెంబర్ మొదటి తేదీ నాటి నోటిఫికేషన్ మరియు నియామకాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ సమస్యలు ఇప్పటికీ కొలిక్కి రాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవడమే ధ్యేయంగా జాతీయ స్థాయిలో జరుగుతున్న ఉద్యమాలకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రంలోనూ తీవ్రమైన పోరాటాలు చేయాలని భావిస్తున్నారు. రిటైర్మెంట్ తర్వాత బ్రతుకు భరోసా కల్పించే ఈ కీలకమైన పెన్షన్ అంశంపై ప్రభుత్వ పెద్దలతో చర్చలు విఫలమైతే ప్రత్యక్ష ప్రొటెక్షన్ కార్యక్రమాలకు దిగాలని కార్యవర్గం నిర్ణయించుకుంది. ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు అత్యంత కీలకంగా మారిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు తీరుపై కూడా నేతలు ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక కార్పొరేట్ ఆసుపత్రులలో ఈ ఆరోగ్య పథకం సరిగ్గా అమలు కావడం లేదనే తీవ్రమైన విమర్శలు మరియు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర వైద్య సేవల సమయంలో ఆసుపత్రులు స్పందించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని మరింత సమర్థవంతంగా అలాగే పక్కాగా అమలు చేయాల్సిన ఆవశ్యకతపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించి ప్రభుత్వానికి స్పష్టమైన ప్రతిపాదనలు పంపాలని నిశ్చయించారు. ఆరోగ్య భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడేది లేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు కార్పొరేట్ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపరచాలని డిమాండ్ చేయనున్నారు. వైద్య సేవల బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ జాప్యం కారణంగా ఉద్యోగులు పడుతున్న నష్టాలను ఈ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించి తగిన పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయనున్నారు. ఈ అత్యంత కీలకమైన సమావేశానికి టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి. శ్యామ్ తదితర ప్రముఖ నేతలు నాయకత్వం వహించనున్నారు. సంఘంలోని అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు ఈ భేటీకి హాజరై తమ జిల్లాల వారీగా ఉన్న సమస్యలను, ఉద్యోగుల నాడిని నాయకత్వానికి వివరించనున్నారు. ప్రభుత్వం నుంచి త్వరలోనే సరైన సానుకూల స్పందన రాకపోతే భవిష్యత్‌లో ఎలాంటి కఠినమైన ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై సుదీర్ఘ మంతనాలు సాగించనున్నారు. అవసరమైతే ప్రభుత్వానికి అధికారికంగా సమ్మె నోటీసులు ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా సర్కారీ కార్యాలయాలను స్తంభింపజేసేలా కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వివిధ శాఖల ఉద్యోగులు అంతర్గతంగా సమావేశాలు నిర్వహించి జేఏసీ తీసుకునే ప్రతి నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ తీరుపై అలుపెరగని పోరాటం చేసేందుకు నాయకులు అందరినీ సమాయత్తం చేస్తున్నారు. సమావేశం ముగిసిన వెంటనే ప్రభుత్వంపై పోరాట భేరి మోగించేందుకు అవసరమైన అన్ని రకాల చట్టపరమైన అలాగే సంస్థాగత ఏర్పాట్లను జేఏసీ నాయకత్వం ఇప్పటికే పూర్తి చేసింది. ఉద్యోగుల డిమాండ్లు నెరవేరే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ ఒక సమగ్రమైన డిక్లరేషన్‌ను కూడా ఈ సమావేశం ద్వారా విడుదల చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు అలాగే పెన్షనర్లు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను కూడా ఈ కార్యాచరణలో భాగం చేయడం ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని వ్యూహం రచించారు. రాష్ట్రంలోని కోటి మందికి పైగా ప్రభుత్వ వర్గాల కుటుంబాల ఆశలు అన్నీ ఈ సమావేశంపైనే కేంద్రీకృతమై ఉన్నాయి.

# 73.39 లక్షల ఓట్లు గల్లంతు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్లకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించగా, వీరి పేర్లను ముసాయిదా జాబితాలో చేర్చారు. క్షేత్రస్థాయిలో డోర్ టుడోర్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ ముసాయిదా వివరాలను వెల్లడించారు. ఈ మహత్తర ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడు అత్యంత జాగరూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఓటర్ల జాబితా పారదర్శకతను కాపాడే దిశగా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేసి జాబితాను రూపుదిద్దారు. రాజకీయ పార్టీల నేతలు కూడా ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పాల్గొని తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేశారు. మరోవైపు, ఎన్యుమరేషన్ సర్వే సమయంలో దాదాపు 73.39 లక్షల అంటే 21.7 శాతం ఎంట్రీలు అన్‌కలెక్టబుల్ కేటగిరీ కింద నమోదై ముసాయిదా జాబితా నుంచి తాత్కాలికంగా తొలగింపునకు గురయ్యాయి. వీటిలో శాశ్వతంగా నివాసాలు మారిన వారు , డబుల్ ఎంట్రీలు , మరణించిన వ్యక్తుల వివరాలు ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఈ తరహా వలస , అన్‌ట్రేసబుల్ ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు తరచూ ఇళ్లు మారుతుండటం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని అధికారులు విశ్లేషించారు. జాబితాలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అధికారులు అత్యంత కఠినమైన నిబంధనలను అనుసరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైన వాస్తవాల ఆధారంగానే ఈ తొలగింపు చర్యలు చేపట్టడం జరిగింది. ఓటర్ల సంఖ్య , నివాస ప్రాంతాల మార్పుల ఆధారంగా ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్య 36,353కి పెరిగింది. ఓటర్లు





తమ నివాసాలకు సమీపంలో సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, రద్దీని నివారించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్ల పరిమితిని క్రమబద్ధీకరించారు. గతంలో ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా చేరుకునే ప్రాంతాల్లోనే పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. మౌలిక వసతుల కల్పనకు కూడా ఎన్నికల అధికారులు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. ప్రతి ఓటరు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తమ ఓటు హక్కును సజావుగా నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా తప్పులు దొర్లిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పిస్తూ అభ్యంతరాలు, చేర్పుల గడువును అధికారులు ప్రకటించారు. దీని ప్రకారం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. ఓటర్లు తమ స్థితిని సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా అలాగే ఆఫ్‌లైన్ ద్వారా కూడా పూర్తి చేయవచ్చు. బూత్ స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన ఫారాలను సేకరించుకోవచ్చు. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని కూడా హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటర్ల జాబితాలో తమ పేరును పరిశీలించుకోవాలని అధికారులు కోరారు. తప్పుల తడకగా ఉన్న జాబితాలను సవరించుకోవడానికి ఈ విడత సవరణ ఒక సువర్ణావకాశం అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని ఓటర్లకు ఈ విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. యువత నూతనంగా ఓటరు నమోదు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతీ పౌరుడి భాగస్వామ్యంతోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతం అవుతుందని నిరూపించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తుది జాబితాను రూపొందించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది. రాష్ట్రంలో రాబోయే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ ముసాయిదా జాబితా తయారీ తొలి అడుగుగా నిలిచింది. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ఎన్నికల ప్రక్రియ కూడా పరిపూర్ణం కాదని అధికారులు స్పష్టం చేశారు. అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన వెంటనే అధికారులు క్షుణ్ణంగా పరిశీలన జరుపుతారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను సరిదిద్దుకోవాలని మరోసారి కోరారు. పకడ్బందీ ఏర్పాట్లతో తెలంగాణ ఎన్నికల చరిత్రలో ఈ సవరణ ప్రక్రియ ఒక మైలురాయిగా నిలవనుంది.

# రైతులకు ఏటా కన్నీళ్లే!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతున్నప్పటికీ జలాశయాలు చెరువులు పూర్తిస్థాయిలో నిండడం లేదు. మరోవైపు ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి ఆలస్యంగానైనా భారీగా వరద చేరుతోంది. అయితే ఆ వరదను ఒడిసి పట్టుకుని సాగు తాగునీటి అవసరాలకు వినియోగించుకునేంతగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిల్వ సామర్థ్యం లేకపోవడం రైతులకు శాపంగా మారింది. వరద నీరు వస్తుందని రైతులు సంబరపడేలోపే నిల్వ చేసుకునే అవకాశం లేక అది దిగువకు వెళ్లిపోతోంది. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, అందుకు అనుగుణంగా జలాశయాలు ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ప్రతి ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో నారాయణపూర్ డ్యామ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో కేవలం పద్దెనిమిది రోజుల వ్యవధిలో జూరాల ప్రాజెక్టుకు దాదాపు నూట తొంభై టీఎంసీల వరద నీరు చేరింది. అయితే ఇందులో ఏకంగా నూట డెబ్బై ఐదున్నర టీఎంసీలు దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది. మిగిలిన పద్నాలుగున్నర టీఎంసీలలో పదకొండున్నర టీఎంసీలను నెట్టెంపాడు భీమా ఒకటి భీమా రెండు కోయిలసాగర్ ప్రాజెక్టులు వివిధ ఎత్తిపోతల పథకాలకు వినియోగించారు. మరో మూడు టీఎంసీల నీరు మాత్రమే జూరాల ప్రాజెక్టులో నిల్వ ఉంది. భారీగా వరద వచ్చినా దాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడం ఉమ్మడి జిల్లా సాగునీటి పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు ముందుగానే నీటిని నిల్వ చేసుకునే జలాశయాలు ఉంటేనే రైతులకు కొంత భరోసా ఉంటుంది. నెట్టెంపాడు కింద గుడ్డెందొడ్డి జలాశయం నిల్వ సామర్థ్యాన్ని ఒకోటి పన్నెండు టీఎంసీల నుంచి పదిహేను టీఎంసీలకు పెంచే ప్రతిపాదన ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట నిర్మాణానికి భూసేకరణ చర్యలు కొనసాగుతున్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్ ఏదుల వట్టెం కర్వెన ఉదండాపూర్ రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు యాభై ఎనిమిదిన్నర టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కడికక్కడ రిజర్వాయర్లు జలాశయాలు అందుబాటులోకి వస్తేనే భవిష్యత్తులో సాగునీటి



అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణానదిలో సుమారు ఐదు నెలలపాటు నిరంతర ప్రవాహం కొనసాగితేనే ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి ఉంది. మిగిలిన కాలంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం నీటి కేటాయింపులు చేసినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. జూరాలకు పదిహేడు టీఎంసీలు నెట్టెంపాడుకు ఇరవై ఒకటి టీఎంసీలు భీమా ఒకటి భీమా రెండుకు కలిపి ఇరవై టీఎంసీలు కోయిలసాగర్‌కు మూడు తొమ్మిది టీఎంసీలు కేఎల్ఐకి నలభై టీఎంసీలు ఆర్డీఎస్ కింద పదిహేను తొమ్మిది టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. అయితే తగిన నిల్వ సామర్థ్యం లేకపోవడంతో ఏటా అందుబాటులోకి వచ్చే నీటిలో కొంతభాగం మాత్రమే వినియోగించుకోగలుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇరవై లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా అందులో ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా సాగునీటి ప్రాజెక్టులపై ఆధారపడి ఉంది. ఇంత భారీ ఆయకట్టుకు అనుగుణంగా రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం మాత్రం ముప్పై టీఎంసీలకు మించడం లేదు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యం నాలుగు టీఎంసీలు ఉన్నప్పటికీ లీకేజీల కారణంగా రెండు టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. భీమా ఒకటి కింద ఉన్న సంగంబండ రిజర్వాయర్‌కు మూడు ముప్పై ఒకటి టీఎంసీల సామర్థ్యం ఉన్నా పూర్తిస్థాయిలో నింపేందుకు నెల రోజుల పాటు పంపులు పనిచేయాల్సి వస్తోంది. ఇక ఆర్డీఎస్ కింద అసలు పెద్ద జలాశయాలే లేకపోవడం మరో సమస్యగా మారింది. శ్రీశైలం జలాశయంలోని నీటిని కేఎల్ఐ ద్వారా మూడు దశల్లో ఎత్తిపోసి నాగర్‌కర్నూల్ వనపర్తి మహబూబ్‌నగర్ రంగారెడ్డి జిల్లాల్లో పెంచిన సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందుకోసం నలభై టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక ఉంది.

## కేవలం 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష

**ఉత్తర్‌ప్రదేశ్:**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ కోర్టు సంచలన తీర్పులతో వార్తల్లో నిలిచింది. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్ గత నాలుగు నెలల్లో విచారించిన 10 కేసుల్లో.. ఏకంగా 22 మందికి మరణశిక్ష విధించారు. న్యాయవాది హత్య నుంచి కిడ్నాప్, దోపిడీ వంటి పలు కేసుల్లో దోషులుగా తేలిన వారికి ఈ శిక్షలు పడ్డాయి. గతంలో బరేలీలో పనిచేసిన సమయంలోనూ న్యాయమూర్తి రవి కుమార్ దివాకర్.. 13 మందికి మరణశిక్ష విధించారు. దాంతో ఇప్పటివరకు ఆయన విధించిన మరణశిక్షల సంఖ్య 35కు చేరింది. 2022లో వారణాసిలోని జ్ఞాన్‌వాపీ మసీదు సముదాయంలో వీడియో సర్వేకు ఆదేశించి ఆయన జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఇటీవల కాలంలో వరుసగా మరణశిక్షలు విధించడంతో 'అత్యంత అరుదైన కేసుల్లోనే' ఈ శిక్ష విధించాలన్న న్యాయసూత్రంపై చర్చ మొదలైంది. అయితే సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష తుదితీర్పు కాదు. హైకోర్టు ధ్రువీకరించిన తర్వాతే దాన్ని అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ హైకోర్టు సెషన్స్ కోర్టు విధించిన శిక్షను ధృడపర్చినా పైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.



# టిమ్స్‌ని ప్రారంభించిన సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

200 మంది వైద్య సిబ్బంది సేవలందించనున్నారు. టిమ్స్ సనత్‌నగర్‌కు మాజీ డీఎంఈ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఏడీఎంఈ డాక్టర్ మహబూబ్ ఖాన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రుల నుంచి తీసుకున్న వారితో పాటు ఇటీవల కొత్తగా రిక్రూట్ చేసిన సుమారు 200 మంది వైద్య సిబ్బంది టిమ్స్‌లో సేవలందించనున్నారు. మొదటి విడత కింద 582 పడకలను అందుబాటులోకి తెస్తూ, మిగిలిన 500 పడకలను అక్టోబర్ నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైద్యరంగంలో ఈ సంస్థ అగ్రగామిగా నిలవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. హైదరాబాద్ నగరంలో నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండాలనే ఆలోచనతో గత ప్రభుత్వ హయాంలో తలపెట్టిన సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి ప్రారంభించడం విశేషం. సనత్‌నగర్ టిమ్స్ ప్రధానంగా నాలుగు కీలకమైన వైద్య విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నది. కార్డియాక్ గుండె సంబంధిత, నెఫ్రాలజీ యూరాలజీ మూత్రపిండాల సంబంధిత, ట్రామాకేర్, ప్రత్యేకంగా అవయవ మార్పిడీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలకు ఇది ప్రధాన కేంద్రంగా నిలువనున్నది. వీటితోపాటు అనుబంధంగా మరో 37 ప్రత్యేక వైద్య విభాగాలు ఏర్పాటు కానున్నాయి. నిమ్స్ తరహాలోనే స్వయం ప్రతిపత్తి అటానమీ హోదా కలిగిన ఈ దవాఖానకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు తొలి ఐదు నుంచి ఆరేండ్లపాటు ప్రభుత్వమే గ్రాంట్ల రూపంలో నిధులు అందించనున్నది. భవిష్యత్తులో ఈ ఆసుపత్రి రోగులకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యుత్తమ వైద్య భరోసా ఇస్తుంది. నిపుణులైన వైద్యుల సేవలు రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. వైద్య విద్యార్థులకు కూడా ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా టిమ్స్ ఆసుపత్రి రూపు




దిద్దుకుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ వైద్యాలయం పేదలకు వరంలా మారుతుంది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉచిత సేవలు లభించేలా ఏర్పాట్లు జరిగాయి. అత్యవసర చికిత్సల కోసం వచ్చే రోగులకు నిమిషాల వ్యవధిలోనే వైద్యం అందేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్ ద్వారా రోడ్డు ప్రమాద బాధితులను త్వరగా రక్షించే అవకాశం కలుగుతుంది. నిపుణుల పర్యవేక్షణలో అత్యవసర విభాగాలు నిరంతరం పనిచేస్తాయి. ప్రతి రోజూ వేల సంఖ్యలో ఓపీ సేవలు అందించేలా వసతులు కల్పించారు. అధునాతన ల్యాబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా అన్ని రకాల రక్త పరీక్షలు ఒకే చోట జరిగేలా చూశారు. రోగుల సహాయకుల కోసం ప్రత్యేక వసతి గృహాలు నిర్మించారు. ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం ఉంటేలా మొక్కలు పెంచాలని నిర్ణయించారు. స్వచ్ఛమైన వాతావరణం రోగుల తొందర కోలుకోవడానికి సహకరిస్తుందని వైద్యులు అంటున్నారు. వైద్య సేవలతో పాటు పరిశోధన రంగానికి కూడా ఈ సంస్థ పెద్దపీట వేయనుంది. విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వడానికి ప్రొఫెసర్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక విభాగాలు ప్రారంభించే అవకాశం ఉంది. నిధుల కొరత లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఆరోగ్య శ్రీ కింద కూడా అన్ని రకాల చికిత్సలు ఉచితంగా లభిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. పేద ప్రజల ఆయుష్షు పెంచేలా ఈ ఆసుపత్రి ముద్ర వేయనుంది. నగరంలోని ఇతర పెద్ద ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గించడానికి ఈ నిర్మాణం ఎంతగానో దోహదపడుతుంది. ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టింది. ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించడమే మా ధ్యేయమని డైరెక్టర్ తెలిపారు. సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ప్రభుత్వం మరింత ఉత్సాహంగా ముందుకు వెళుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఈ సంస్థ సేవలు ఉంటాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రతి శస్త్రచికిత్స విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మందుల కొరత రాకుండా ఫార్మసీలను ఎప్పుడూ నిండుగా ఉంచుతారు. అత్యవసర ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. రోగుల రికార్డులను డిజిటలైజేషన్ చేసి త్వరగా వైద్యం అందేలా చేస్తున్నారు. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడకుండా ఆన్‌లైన్ టోకెన్ల విధానం ప్రవేశపెట్టారు. దీనివల్ల వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు తొలగిపోతాయి. స్వచ్ఛతకు పెద్దపీట వేస్తూ నిరంతరం ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుతారు. ఇన్ఫెక్షన్లు రాకుండా అత్యాధునిక స్టెరిలైజేషన్ పద్ధతులు అమలు చేస్తున్నారు. రోగుల బంధువులు ఆందోళన చెందకుండా కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి విభాగంలో హెల్ప్‌డెస్క్ సిబ్బంది రోగులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటారు. తెలంగాణ వైద్య చరిత్రలో సనత్‌నగర్ టిమ్స్ మైలురాయిగా నిలిచిపోతుంది. నిరుపేదలకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందాలనే స్వప్నం నేడు సాకారమవుతోంది. ప్రభుత్వ కృషితో ఈ ఆసుపత్రి అతి త్వరలో పూర్తి స్థాయి సేవలు అందిస్తుంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సంస్థ దేశానికే ఆదర్శంగా మారుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పరకాల గడ్డపై మూడు ముక్కలాట!

మొదటిపేజీ తరువాయి

పార్టీగా గుర్తింపు పొందిన అప్పటి టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ ముఖ్యమంత్రయ్యారు. ఆ తర్వాత ఏకంగా పదేళ్ళు కేసీఆర్ పాలన సాగింది. పదేళ్ళు అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఉనికి ఒక దశలో ప్రశ్నార్థకంగా మారింది. ఈ స్థితిలో 2023లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేసీఆర్ ను ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్ సీఎం అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు జరిగాయి. అనూహ్య పరిణామాల మధ్య పరకాల అసెంబ్లీ నుంచి రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్నికల ప్రకటన వరకూ కూడా రేవూరి బీజేపీలో కొనసాగారు. నామినేషన్ కు కొద్ది రోజుల ముందు కాంగ్రెస్ లో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. రేవూరి గతంలో టీడీపీ నుంచి నర్సంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. హనుమకొండ నుంచి కూడా పోటీచేశారు. ఇప్పుడు పక్క నియోజకవర్గమైన పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గ కాంగ్రెస్లో గ్రూపుల వర్గపోరు ఆ తర్వాత రోడ్డెక్కాయి. దీంతో పరకాల రాజకీయం మూడు ముక్కలాటగా మారి రాష్ట్రంలో కొత్త చర్చను లేవనెత్తింది. పరకాల కాంగ్రెస్ లో మూడు ముక్కలాట సాగుతోంది. స్థానికంగా పార్టీ కేడర్ రేవూరి, కొండా, ఇనుగాల వర్గాలుగా విడిపోయారు. ఈ విచిత్ర పరిస్థితికి పలు కారణాలున్నాయి. ఈ నియోజవర్గాన్ని ఎవరికి వారు తమ సొంత జాగీరుగా భావించడమే ఈ వివాదానికి కారణంగా భావిస్తున్నారు. గతంలో పరకాల ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రస్తుత వరంగల్ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దంపతులది ఒక గ్రూపు, గతంలో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలైన మాజీ నియోజకవర్గ ఇంచార్జ్ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాం రెడ్డిది మరో గ్రూపు, ఇక ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిది మరో గ్రూపు. ఈ గ్రూపు రాజకీయాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో నాయకులు బహిరంగంగా బాహాబాహికి దిగిన సందర్భాలున్నాయి. కొండా దంపతుల సొంత గ్రామం వంచనగిరి మండలం గీసుకొండ పరకాల నియోజకవర్గంలో ఉంటోంది. గతంలో శాయంపేట ఎమ్మెల్యేగా పరకాల కాంగ్రెస్



ఎమ్మెల్యేగా సురేఖ గెలుపొందారు. 2009లో వైఎస్ మంత్రి వర్గంలో సురేఖ పనిచేశారు. ఆయన మరణం తర్వాత మంత్రి పదవికి రాజీనామా చేసి జగన్ వెంట వైఎస్సార్సీపీలో చేరారు. 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి ములుగూరి భిక్షపతి చేతిలో ఓటమిపాలయ్యారు. తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ లో చేరారు. కొద్ది రోజులకే ఎన్నికలురావడంతో టీఆర్ఎస్ చేరి వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2018 ఎన్నికల్లో తొలి జాబితాలో సురేఖకు టీఆర్ఎస్ టికెట్ నిరాకరించడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ లో చేరి తూర్పును విడిచిపెట్టి పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అతరువాత చాలా కాలం స్తబ్ధంగా ఉన్న కొండా దంపతులు 2023 ఎన్నికలకు కొద్ది నెలల ముందు తిరిగి వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలిచి రేవంత్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. ఈ ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇనుగాలకు అవకాశం ఇవ్వకుండా బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన రేవూరికి చాన్సు ఇవ్వడంతో అంతా ఆయన విజయానికి సహకరించారు. పరకాల నియోజవర్గంలో తమ వర్గం నాయకులను రేవూరి తొక్కేస్తున్నారంటూ కొండా దంపతులు బహిరంగంగా ఎమ్మెల్యే రేవూరి పై విమర్శలు ఎక్కుపెట్టారు. ఎన్నికల ముందు తమ కాళ్ళుపట్టుకుని ఇప్పుడు తమ పై పెత్తనం చెలాయిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. రేవూరి కొండా దంపతుల మధ్య మాటల యుద్ధం పతాకస్థాయికి చేరి రోడ్డునపడ్డారు. గీసుకొండ మండలంలో కేసులతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతే మంత్రిగా సురేఖ అక్కడికి వెళ్ళిన సందర్భాలు విమర్శలకు తావిచ్చింది. స్థానిక ఎన్నికల్లో ఒకే కాంగ్రెస్ పార్టీ నుంచి రేవూరి కొండా వర్గాలు వేర్వేరు పోటీచేసి గెలుపోటములను చవిచూశారు. ఈ ఇద్దరి మధ్య వర్గపోరు తీవ్రస్థాయికి చేరిన సందర్భంలో కొండా కుటుంబం తీవ్రంగా ప్రతిస్పందించింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తమ కుమార్తె సుస్మిత పోటీచేస్తారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించగా తాను పోటీ చేసి తీరుతానంటూ కొమ్మాల జాతర సందర్భంగా సుస్మిత కూడా బహిరంగంగా తేల్చి చెప్పారు. పరకాల మా అడ్డా అంటూ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. దాదాపు గత మూడేళ్ళుగా రేవూరి కొండా వర్గాలు ఉప్పు నిప్పులా వ్యవహరిస్తున్నారు. నిజమైన కాంగ్రెస్ వాదులను తమ అనుచరులను వర్గాన్ని రేవూరి అణచివేస్తున్నారంటూ కొండా దంపతులు ఆగ్రహంతో ఉన్నారు. 2014లో పరకాల నుంచి ఇనుగాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2023 వరకు పరకాల కాంగ్రెస్ ను పట్టుకుని ముందుకు సాగారు. 2018లో సురేఖ కోసం 2023లో రేవూరి కోసం ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో నిలబెట్టిన ఇనుగాల వెంకట్రాం రెడ్డి ప్రాతినిధ్యం పరకాలలో లేకుండా రేవూరి ప్రయత్నిస్తున్నారని వీరి మధ్య కూడా పంచాయతీ సాగుతోంది. స్థానిక నేతగా డీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ రేవూరి వర్గం తనను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కొండా వర్గంతోనూ ఆయనకు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పరకాలలో జరిగిన సీఎం రేవంత్ సభకు డీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ ఇనుగాల గైర్హాజరు కావడం కలకలం సృష్టించింది.

# అల్ట్రా లగ్జరీ హబ్ కోకాపేట!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఒకప్పుడు హైదరాబాద్‌లోని సంపన్నులు, గ్రేటర్ ప్రముఖులు నివాసముండేందుకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలనే మొదటి ప్రాధాన్యతగా ఎంచుకునేవారు. అయితే, కాలక్రమేణా మారుతున్న ఆధునిక జీవనశైలి, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల నడుమ భాగ్యనగరంలో ఆ ట్రెండ్ వేగంగా మారుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే అత్యంత ప్రీమియం, విలాసవంతమైన హైరైజ్ ప్రాజెక్టులకు కోకాపేట్ ప్రధాన కేంద్ర బిందువుగా అవతరించింది. విశాలమైన లగ్జరీ స్కైస్క్రాపర్లు, నియోపోలిస్ ఏరియా డెవలప్‌మెంట్స్, అంతర్జాతీయ హంగులతో కోకాపేట్ ఇప్పుడు నగర రియల్ ఎస్టేట్ రంగానికి నయా రాచబాటగా మారింది. పాత కాలపు హంగులకు భిన్నంగా సరికొత్త హంగులతో ఈ ప్రాంతం రూపుదిద్దుకుంటోంది. స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంగా ఇక్కడ ఆస్తులు కొనుగోలు చేస్తున్నారు. నగర వైభవాన్ని ఇనుమడింపజేసే రీతిలో ఈ నిర్మాణాలు సాగుతున్నాయి. భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులను ఇక్కడ కల్పిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం కోరుకునే వారికి ఇది సరైన వేదికగా మారుతోంది. ప్రభుత్వ విధానాలు కూడా రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ ఇక్కడ నివసించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. పారిశ్రామిక వేత్తలు వ్యాపార దిగ్గజాలు ఈ ప్రాంతం వైపు అడుగులు వేస్తున్నారు. కాలం మారుతున్న కొద్దీ నగర కేంద్రం కూడా పశ్చిమ వైపునకు విస్తరిస్తోంది. ప్రస్తుతం కోకాపేట్ పరిధిలో చదరపు అడుగు ధర సగటున రూ. 9,000 నుండి రూ. 14,000 వరకు పలుకుతుండగా, ప్రీమియం, అప్పర్ ఫ్లోర్ విల్లాలు, పెంట్ హౌస్‌ల ధరలు మరిన్ని రికార్డులను తిరగరాస్తున్నాయి. గత కొన్నేళ్లుగా హెచ్ఎండీఏ నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరం ధర రూ. 100 కోట్లు దాటి రికార్డు సృష్టించడం ఈ ప్రాంత డిమాండ్‌కు అద్దం పడుతోంది. ఎన్ఆర్ఐలు, బహుళ



జాతీయ సంస్థల సీఈఓలు, ఐటీ రంగానికి చెందిన బిజినెస్ లీడర్లు, హెచ్ఎన్ఐలు పాత బంజారాహిల్స్ పరిధిలోని ఆస్తుల కంటే కోకాపేట్‌లోని హైరైజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికే అత్యధిక ఆసక్తి చూపుతున్నారు. ఈ పెట్టుబడులు భవిష్యత్తులో భారీ లాభాలను తెచ్చిపెడతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విదేశీ సంస్థలు సైతం ఇక్కడ భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. సామాన్యులకు సైతం ఈ ధరలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. భూముల విలువ అసాధారణ రీతిలో పెరుగుతుండటంతో స్థానిక యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఈ మార్కెట్ నిలకడగా ముందుకు సాగుతోంది. నూతన ప్రాజెక్టుల రాకతో నిర్మాణ రంగం కళకళలాడుతోంది. ప్రతి అంగుళం భూమికి బంగారు భవిష్యత్తు లభిస్తోంది. 50 నుంచి 60 అంతస్తులకు పైగా నిర్మితమవుతున్న ఆకాశహర్మ్యాలు, క్లబ్‌హౌస్‌లు, స్కై లాంజ్‌లు, ఏరో స్పేస్ వ్యూ, ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్స్ వంటి హంగులతో కోకాపేట్‌ను గ్లోబల్ లుక్‌లోకి తీసుకెళ్తున్నారు ప్రముఖ బిల్డర్లు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి ఐటీ కారిడార్లకు కూతవేటు దూరంలో ఉండటంతో పాటు, ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 2530 నిమిషాల్లో చేరుకునే అద్భుతమైన కనెక్టివిటీ ఉండటం ఈ ప్రాంతానికి అతి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. ట్రాఫిక్ చిక్కులు లేకుండా విశాలమైన రోడ్లు, ప్రశాంత వాతావరణం కూడా ఇక్కడ నివాసం ఉండేందుకు ప్రతిష్ఠాత్మక హోదాగా మారింది. కార్పొరేట్ ఉద్యోగులు నగర నివాసితులు ఇక్కడ ఇళ్లు కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నారు. అత్యాధునిక భద్రతా వ్యవస్థలు పిల్లల ఆటస్థలాలు అన్నీ ఒకే ప్రాంగణంలో లభిస్తున్నాయి. జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతున్నాయి. విలాసవంతమైన జీవితాన్ని కోరుకునే వారికి ఇదొక అద్భుతమైన గమ్యస్థానంగా నిలుస్తోంది. ప్రతి సౌకర్యం అందుబాటులో ఉండటం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. మొత్తానికి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కాదు.. ఇక కోకాపేటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ క్రౌన్ అన్నట్లుగా పరిస్థితులు మారాయి. స్థిరాస్తి విశ్లేషకుల ప్రకారం.. రాబోయే రోజుల్లో మెట్రో ఫేజ్ 2 కనెక్టివిటీ, వాణిజ్య సముదాయాల విస్తరణతో ఇక్కడ ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉంది. ఆధునిక సౌకర్యాలు, సురక్షితమైన గేటెడ్ కమ్యూనిటీ జీవనం, అధిక అద్దె ఆదాయం, రీసేల్ వ్యాల్యూ ఆశిస్తున్న ఇన్వెస్టర్లకు కోకాపేట్ తొలి ఛాయిస్‌గా నిలుస్తూ నగర స్కైలైన్‌ను తిరగరాస్తోంది. భవిష్యత్తు తరాలకు ఇదొక అద్భుతమైన చిరునామాగా మారుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. నగర అభివృద్ధికి ఈ ప్రాంతం తలమానికంగా నిలుస్తోంది. ప్రభుత్వం కూడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ప్రశాంతమైన వాతావరణం లభిస్తోంది. పర్యావరణ హితమైన నిర్మాణాలకు బిల్డర్లు పెద్దపీట వేస్తున్నారు. హరిత వనాలు విశాలమైన ఉద్యానవనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రజల జీవన శైలిని పూర్తిగా మార్చేసే శక్తి ఈ ప్రాంత సొంతం. తెలంగాణ రాష్ట్రంలోనే కోకాపేట్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. కేవలం నివాస సముదాయాలే కాకుండా వాణిజ్య కేంద్రాలు కూడా భారీ ఎత్తున వెలుస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి మాల్స్ వినోద కేంద్రాలు కార్పొరేట్ ఆఫీసులు ఇక్కడ కొలువుదీరుతున్నాయి. దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. యువతకు ఎన్నో రకాల ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రాత్రింబవళ్ళు సందడిగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు నగరానికి సరికొత్త గుండెకాయలా మారుతోంది. పర్యాటకులు సైతం ఇక్కడి నిర్మాణ శైలిని తిలకించేందుకు వస్తున్నారు. నిర్మాణ రంగ నిపుణులు ఈ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన ప్రయోగశాలగా అభివర్ణిస్తున్నారు. ప్రపంచ దేశాల నుంచి వస్తున్న పెట్టుబడిదారులు ఇక్కడ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రాంతం భారీగా ఆదాయాన్ని సమకూరుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లోనూ ఈ ప్రాంతం ద్వారా వచ్చే ఆదాయం అగ్రస్థానంలో నిలుస్తోంది. రాబోయే ఐదేళ్లలో కోకాపేట్ మరింత అద్భుతమైన మార్పులకు కేంద్రంగా మారుతుందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ఈ లేఅవుట్లను అభివృద్ధి చేశారు. అజ్ఞాత వ్యక్తుల ప్రవేశానికి తావులేని విధంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలవుతున్నాయి. వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాంతం మున్ముందు మరిన్ని రికార్డులను సృష్టించడం ఖాయం. సామాన్య ప్రజలకు కూడా ఈ ప్రాంత అభివృద్ధి ఎంతో ఆదర్శంగా నిలుస్తోంది. భవిష్యత్తు తరాలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడంలో ఈ ప్రాజెక్టులు విజయం సాధిస్తున్నాయి. నగర కీర్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే సత్తా కోకాపేట్‌కు మాత్రమే ఉందని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరి కలల నివాసంగా ఈ ప్రాంతం రూపాంతరం చెందుతోంది. కాలం గడిచే కొద్దీ ఇక్కడి ఆస్తుల విలువకు ఎవ్వరూ ఊహించని డిమాండ్ ఏర్పడుతుంది. నగర ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా తీర్చిదిద్దిన ఈ ప్రాంతం ఎప్పటికీ అగ్రగామిగా నిలుస్తుంది.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయొద్దు




- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం ఆలోచన విరమించుకోవాలి
- జీవో నంబర్ 97ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం సంజీవ గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్, శివకుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంలో పాలిటెక్నిక్ విద్య కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి సాంకేతిక విద్యా వ్యవస్థను ఇతర శాఖల్లో విలీనం చేయడం వల్ల విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ప్రైవేటీకరణ దిశగా వెళ్లే పరిస్థితి ఏర్పడితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన డిప్లొమా విద్య అందకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం, ప్రయోగశాలలను ఆధునికీకరించడం, వర్క్‌షాప్‌లు, హాస్టళ్లను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిందని, అందుకు మంత్రివర్గ ఉపసంఘం కూడా ఆమోదం తెలిపిందని వారు గుర్తు చేశారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను అందులో చేర్చే ఆలోచన చేయడం సాంకేతిక విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ విధానంలో స్పష్టత లేకపోవడాన్ని చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని, ఇప్పటికే ప్రవేశ పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరిన విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, జీవో నంబర్ 97ను ఉపసంహరించుకోవాలని, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వినోద్ నాయక్, శివకుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి సత్యం, మండల కార్యవర్గ సభ్యులు అరవింద్, చందు, చరణ్, శశితో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారెడ్డి.. మరో జీవన్ రెడ్డి !

మొదటిపేజీ తరువాయి

ఆయన కొన్ని సంచలన విషయాలను బయటపెట్టారు. తన అనుచరులను అలాగే సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న క్యాడర్‌ను ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుత పరిణామాలు ఇలాగే కొనసాగితే తాను కూడా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాటలోనే పార్టీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేయాల్సి వస్తుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడిన తమకు ఈ పరిస్థితి ఎదురుకావడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై అధిష్ఠానం వెంటనే దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం చిన్నారెడ్డి రాజకీయ సామర్థ్యంపై అనుమానంతో చివరి క్షణంలో ఆయన టికెట్ రద్దు చేసింది. ఆ సమయంలో ఆయనకు బదులుగా మేఘారెడ్డికి పార్టీ అధిష్ఠానం పోటీ చేసే అవకాశం కల్పించింది. ఆ సమయంలో పార్టీ ఆదేశాల మేరకు ఏమీ చేయలేకపోయిన చిన్నారెడ్డి ఇప్పుడు ఎన్నికల తర్వాత తిరుగుబాటు హెచ్చరికలు చేయడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో అన్ని వర్గాలపై పట్టు సాధించి బలంగా పాతుకుపోయిన మేఘారెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవడం చిన్నారెడ్డికి అంత సులభమైన విషయమేమీ కాదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సొంత పార్టీలోనే సొంత ఎమ్మెల్యేపై సీనియర్ నేత ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం క్యాడర్‌లో గందరగోళానికి కారణమవుతోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ వ్యవహారశైలిపై తీవ్రంగా విసిగిపోయినప్పటికీ జీవన్ రెడ్డి తరహాలో ప్రతిపక్ష బిఆర్ఎస్ వైపు వెళ్లేందుకు చిన్నారెడ్డికి రాజకీయంగా ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. దీనికి ప్రధాన కారణం వనపర్తి నియోజకవర్గంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బలమైన నాయకుడిగా కొనసాగుతున్నారు. అక్కడ బిఆర్ఎస్ పార్టీ పట్టు పూర్తిగా నిరంజన్ రెడ్డి చేతిలోనే ఉండటంతో



చిన్నారెడ్డికి అక్కడ ప్రత్యామ్నాయ మార్గం మూసుకుపోయింది. వేరే దారి లేని పరిస్థితిలో ఆయన కేవలం కాంగ్రెస్‌లోనే ఉంటూ అక్కడి స్థానిక నాయకత్వంతో పోరాడాల్సి వస్తోంది. పార్టీలో తన ప్రాధాన్యాన్ని నిలుపుకోవడానికి ఆయన ఈ విమర్శల అస్త్రం సంధించారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ తాజా పరిణామాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న చిన్నారెడ్డి సొంత ఎమ్మెల్యేపై బహిరంగంగా యుద్ధం ప్రకటించడం ప్రభుత్వ పరువును బజారుకీడ్చుతున్నట్లేనని కొందరు నాయకులు మండిపడుతున్నారు. పార్టీలో సమన్వయం సాధించాల్సిన సీనియర్ నేతలే ఇలా వీకెక్కులకెక్కి విమర్శలు చేసుకోవడం వల్ల ప్రతిపక్ష పార్టీలకు ఆయుధాలు ఇచ్చినట్లు అవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. అధిష్ఠానం జోక్యం చేసుకుని ఈ వివాదానికి తెరదించకపోతే రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. స్థానిక కేడర్ రెండు వర్గాలుగా చీలిపోవడం వల్ల భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని స్పష్టమవుతోంది. చిన్నారెడ్డి చేసిన ఈ సంచలన ఆరోపణలపై ఇప్పటివరకు ఎమ్మెల్యే మేఘారెడ్డి నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అయినప్పటికీ ఆయన అనుచరులు మాత్రం చిన్నారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. సీనియర్ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి సొంత ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం సరికాదని వారు వాదిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే కొందరు ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ వనపర్తి కాంగ్రెస్ రాజకీయం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందోనని రాజకీయ పరిశీలకులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

# తెలంగాణ బీజేపీకి దక్కని చోటు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించడం ద్వారా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపింది. దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ సమీకరణాలను నిశితంగా బేరీజు వేసుకుంటూ ఈ నూతన జాబితాను అత్యంత వ్యూహాత్మకంగా రూపొందించారు. పార్టీ పటిష్టత లక్ష్యంగా అగ్రనేతలు తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే కాలంలో జరగబోయే కీలక పరిణామాలకు బలమైన పునాది వేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో కొత్త జోష్ నింపేందుకు అధిష్టానం చేపట్టిన ఈ ప్రక్షాళన సంస్థాగతంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దేశ రాజకీయాల్లో దూకుడు పెంచేందుకు అనుగుణంగా అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు పెద్దపీట వేస్తూ ఈ నూతన కమిటీని కొలువుదీర్చడం విశేషంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు మాజీ సీఎం వసుంధర రాజే, రామ్ మాధవ్ సహా మొత్తం పదమూడు మంది ప్రముఖులకు ఉపాధ్యక్ష పదవులు దక్కాయి. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తిరత్ సింగ్ రావత్, బైజయంత్ జే పాండా, రేఖా వర్మ, వర్షబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతీ ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం నాగరాజా, తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ తదితరులు ఈ కీలక పదవులకు నియామితులయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన నేతలకు



సముచిత స్థానం కల్పిస్తూ జాతీయ స్థాయిలో పార్టీ ప్రభావాన్ని మరింత విస్తరించాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ నియామకాలు జరిగాయి. ఈ బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. భారతీయ జనతా పార్టీ ఎనిమిది మంది శక్తివంతమైన జాతీయ ప్రధాన కార్యదర్శులను నియమించి తన యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఈ కీలక జాబితాలో ప్రముఖ నేత స్మృతి ఇరానీతో పాటు వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లబ్ కుమార్ దేబ్, సతీష్ పూనియా, గజేంద్ర పటేల్, హరీష్ ద్వివేది, సంజయ్ భాటియా స్థానం సంపాదించుకున్నారు. అలాగే పార్టీ జాయింట్ కోఆర్డినేటర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించడం రాష్ట్ర శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. మరోవైపు జాతీయ కార్యదర్శులుగా పదిహేడు మందికి పైగా చోటుకల్పించగా కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్ బాధ్యతలు చేపట్టారు. సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శిగా ఉత్తరాఖండ్‌కు చెందిన మహేంద్ర పాండే నియమితులు కాగా ఓబీసీ మోర్చా నూతన అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్య పేరును పార్టీ అధికారికంగా ప్రకటించింది. సంస్థాగత జనరల్ సెక్రటరీగా మరోసారి బీఎల్ సంతోష్ నియామకం ఖరారు కాగా సంస్థాగత జాయింట్ జనరల్ సెక్రటరీలుగా శివప్రకాష్, సౌదాన్ సింగ్‌ల పేర్లను పార్టీ పెద్దలు ఖరారు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించగా రాజేష్ మంగళ్ జాతీయ సంయుక్త కోశాధికారిగా నియామకం పొందారు. పార్టీ తన సంస్థాగత ప్రచార విభాగాలలో కూడా సమూల మార్పులు చేస్తూ కీలక నియామకాలను ప్రకటించింది. ఉత్సాహంగా పనిచేసే నేతలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా రాబోయే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పార్టీ అధిష్టానం గట్టి పట్టుదలతో ఉంది. ఈ నియామకాలన్నీ సమన్వయంతో సాగి పార్టీని విజయపథంలో నడిపించడానికి ఎంతగానో దోహదపడతాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, గుజరాత్, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల రాజకీయ సమీకరణాలను లోతుగా దృష్టిలో పెట్టుకుని కొత్త జాతీయ కార్యవర్గాన్ని అత్యంత జాగ్రత్తగా ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. త్వరలోనే పార్లమెంటరీ బోర్డు, సెంట్రల్ ఎలక్షన్ కమిటీ, మార్గదర్శక మండలి వంటి కీలక నిర్ణయక సంస్థల్లో కూడా పెనుమార్పులు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల నుంచి బలమైన కథనాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల రథాన్ని విజయవంతంగా ముందుకు నడిపించేందుకు అనువైన వ్యూహాలతో బీజేపీ అగ్రనేతలు పావులు కదుపుతున్నారు. దేశ రాజకీయ యవనికపై తమ ఆధిపత్యాన్ని మరింత చాటుకునేందుకు ఈ సంస్థాగత మార్పులు ఒక వేదికగా మారుతాయని భావిస్తున్నారు. ఈ నూతన జాతీయ కార్యవర్గంలో పొరుగునున్న తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి ప్రాతినిధ్యం దక్కకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన డీకే అరుణను సైతం ఆ ఉన్నత పదవి నుంచి తప్పించడం గమనార్హం. తెలంగాణ బీజేపీ నాయకత్వంలో తీవ్ర స్థాయిలో విభేదాలు కొనసాగుతుండటం, రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో పార్టీ పుంజుకోలేకపోతుండటం దీనికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. త్వరలో జరుగబోయే మంత్రివర్గ విస్తరణలో తగిన అవకాశాలు ఇచ్చే ఉద్దేశంతోనే రాష్ట్ర నాయకులను జాతీయ కార్యవర్గానికి దూరం పెట్టారన్న ప్రచారం బలంగా వినిపిస్తుంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి.

## హల్ద్వాని ఘటనను నిరసిస్తూ జనగామలో నిరసన




**జనగామ జిల్లా విశాల భారతి ;** హల్ద్వాని ఘటనను నిరసిస్తూ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారికి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ జనగామ చౌరస్తాలో కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గారి ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ వేముల మల్లేశం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. దేవరుప్పుల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే గారికి జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిపురంలో విషాదం బాదావత్ రెడ్యా మృతి



**మరిపెడ విశాల భారతి:** గిరిపురం గ్రామానికి చెందిన బాదావత్ రెడ్యా కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.విషయం తెలుసుకున్న మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు గుగులోతు రవి, గ్రామ సర్పంచ్ బాదావత్ నీలా సైదులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. రెడ్యా మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట మండల నాయకుడు అబ్జల్ తదితరులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## బిఆర్ఎస్ పార్టీ మండలనాయకులు తాసిల్దార్ శేఖర్ వినతి పత్రం కార్యాలయం ముందు నిరసన



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి ;** మాక్లూర్ సోమవారం మండలం టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపి రంజిత్ .బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో. తాసిల్దార్ కార్యాలయం ముందు మాక్లూర్ మండల తాసిల్దార్ శేఖర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వినతి పత్రం గోపు రంజిత్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్.కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసే ఆలోచనలో ఉందని ఆరోపిస్తూ, పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ, ఆధ్వర్యంలో ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపు రంజిత్ మాట్లాడుతూ, పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లక్ష వెయ్యి రూపాయల పదహారు రూపాయలు ఇవ్వడం జరిగింది.420 మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు. మభ్యపెడుతుందని. పెన్షన్ విషయంలో. ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదని కోరారు. పథకాలను కొనసాగిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాక్లూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపు రంజిత్ మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల కోఆప్షన్ నెంబర్ కోకైమాద్ మాజీ ఉపసర్పంచ్ అనిత దర్గాల సాయిలు మాజీ సర్పంచ్ అశోక్ రావు గణేష్. కరీం. సీనియర్ నాయకులు యువ నాయకుడు తాజుద్దీన్.. గంగాధర్ నరసయ్య సీనియర్ నాయకులు . హైమద్. సాయన్న. శ్రీనివాస్. .కార్యకర్తలు పాల్గొనడం జరిగింది,

## సమీకృత మండల కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభం



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి ;** మాక్లూర్ : మాక్లూర్ మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రజావాణిలో 19 శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం ఆరు వినతులు వచ్చాయని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేఖర్ ఎంపిడిఓ., మండల వ్యవసాయ అధికారి పద్మ,. విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ , హౌసింగ్ ఏఈ సౌజన్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ డిప్యూటీ తహసిల్దార్ పద్మ, లత ఫారెస్ట్ అధికారి అశోక్ మెడికల్ ఆఫీసర్ , ఐకెపి. ఎపిఎం., ఏపిఒ. పంచాయతీరాజ్ ఏఈ. తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ

**సర్పంచ్‌ల ఫోరం రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఏనుగు నరందర్ రెడ్డి నియమకం**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షులుగా ఇబ్రహీంపట్నం మండల్ తుర్కా గుడ సర్పంచ్ ఏనుగు నరందర్ రెడ్డి సోమవారం ఎన్నికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) వారు ఆధ్వర్యంలో రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు గా ఏనుగు నరందర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ జిల్లా లో మండల సమగ్ర అభివృద్ధి గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం మంచి పరిపాలన సాధ్యమయ్యే విధంగా సమిష్టి కృషిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఫోరం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఏనుగు నరందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందున బాధ్యత మరింత పెరిగిందని, అందరి సహకారంతో జిల్లా మండల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నా ఎన్నిక పట్ల సహకరించిన బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి , రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి( బంటీ )కి జిల్లా బిఆర్ఎస్ పార్టీ,మండల్ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు కి, మండల్, జిల్లా నాయకులు కి కృతజ్ఞతలు తెలిపారు.. వారి నియమకం పట్ల గ్రామ ప్రజలు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు .

## ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

**8 దరఖాస్తుల స్వీకరణ.. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలకు ఆదేశాలు : ఎంపీడీవో శ్రీవాణి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలు, ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదులు, దరఖాస్తులను సమర్పించారు.ప్రజావాణిలో ప్రజల నుంచి మొత్తం 8 దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును ప్రజాపాలన వెబ్‌ద్వారం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖల అధికారులకు తదుపరి చర్యల కోసం పంపించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీవాణి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తున్నామని, అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, చిన్న రావిర్యాల గ్రామ సర్పంచ్ బాలకృష్ణ గౌడ్ మరియు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే యాచారం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** నేడు యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి, కేసి తండా, నల్లవెల్లి, తమ్మ లోని కూడా, చౌదర్పల్లి గ్రామాలలో మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి శంకుస్థాపన కు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని, ఎమ్మెల్యే కోరారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ను పాతరేస్తున్నారా..?

**శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ.. ప్రభుత్వంపై మండిపాటు**






**సైబరాబాద్ విశాల భారతి;** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణారావు దిశా నిర్దేశంలో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో పీజేఆర్ స్టేడియం నుంచి ఎన్‌హెచ్ 65 ముంబై జాతీయ రహదారి వరకు ర్యాలీ సాగింది. సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందంటూ నాయకులు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్ష రూపాయలకు పైగా అందిన ఆర్థిక సాయం కొనసాగించాలని డిమాండ్ చేశారు. "కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కొనసాగాలి.. పేదింటి ఆడబిడ్డ గెలవాలి" అంటూ నినాదాలు చేశారు. పథకాలను వెంటనే పునరుద్ధరించకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్లు రంగా రావు, మిద్దెల మల్లారెడ్డి, పారునంది శ్రీకాంత్, రామకృష్ణ గౌడ్, కార్తిక్ రాయల, పొట్ట నరేందర్ యాదవ్, విజయ్‌రెడ్డి, అల్లాఉద్దీన్, జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే యాచారం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** నేడు యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి, కేసి తండా, నల్లవెల్లి, తమ్మ లోని కూడా, చౌదర్పల్లి గ్రామాలలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, ఈ అభివృద్ధి శంకుస్థాపన కు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీశైలం కోరారు.

## గురుకుల అడ్మిషన్ కోసం తల్లి గోడు.. ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

**తిరుమలగిరి: విశాల భారతి :**

తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురాగా, మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో లాజరు వెల్లడించారు. వాటిలో మూడు రెవెన్యూ శాఖకు, ఒకటి విద్యాశాఖకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. "నా కొడుకుకు మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించండి సార్" అంటూ ఓ తల్లి విద్యాశాఖ అధికారులను వేడుకోవడం ప్రజావాణిలో భావోద్వేగానికి గురిచేసింది. గురుకులాల ప్రవేశం కోసం తన కుమారుడు కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రాసినా ఎక్కడా అడ్మిషన్ సీటు లభించలేదని, తమకు ముగ్గురు పిల్లలు ఉండటంతో ప్రైవేట్ విద్యను భరించే ఆర్థిక స్తోమత లేదని ఆమె వాపోయింది. తన కుమారుడికి చదువుపై ఉన్న ఆసక్తిని చూసి అడ్మిషన్ కోసం కలెక్టర్, ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి వేడుకున్నానని, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌కు సైతం



అర్జీ పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని తల్లి తన గోడును అధికారుల ఎదుట వెళ్లబోసుకుంది. ఇదిలా ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రజాసంఘాల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కనీస మౌలిక వసతులు లేకుండానే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వ్యవసాయం, విద్యుత్, వైద్యం, పోలీస్, విద్య, మహిళా శిశు సంక్షేమం, పశువైద్యం, గ్రామీణ నీటిపారుదల తదితర శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, డీటీ జాన్ మహ్మద్, ఎంపీఓ భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయపోలులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం





- **రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు**
- **దుర్వాసన, దోమలు, స్వైర్య విహారం**
- **దెబ్బతిన్న డ్రైనేజీ లైన్లు**
- **పట్టించుకోని అధికారులు**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మురికి నీటి వల్ల పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తుంది. ఈ నీటిలో దోమలు, ఈగలు పెరుగుతున్నాయి. దీని వల్ల అనారోగ్యాలకు గురవుతున్నమనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయపోలు గ్రామంలోని 7వ వార్డులో డ్రైనేజీ పొంగి రోడ్డుపై ప్రవేశిస్తుందని పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కాలనీవాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సరి చేయాలని ఆరు నెలలు గడుస్తున్న మరమ్మత్తులు చేయడంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ ఘోరంగా విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసిన పరిచయం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు.

**డ్రైనేజీ పొంగి ప్రవేశిస్తున్న పట్టించుకోరా...? : మేకల రవీందర్**

రాయపోలు గ్రామ పరిధిలోని 7 వ వార్డులో డ్రైనేజీ పొంగి స్థానికులు మేకల రవీందర్ ఆరోపించారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదు గ్రామపంచాయతీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసిన పాపాన పోలేదు. ప్రతిరోజు మురుగునీటి లోనిచ్చే వెళ్లాల్సి వస్తుంది. రోడ్డుపై మరుగునీరు కారణంతో దుర్గంధం వేసి దోమలు, ఈగలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ప్రజలు అంటు రోగాల బారిన పడకముందే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు.

## పోక్సో నిందితుడికి జైలు శిక్ష



**బాలికకు రూ.50 వేల పరిహారం.. నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.3 వేల జరిమానా**

**అబ్దుల్లాపూర్ మెట్, విశాల భారతి :** పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పు వెలువరించినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించినట్లు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 405/2025లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 78, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్ విత్ 12 కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఉప్పు రాకేష్ (24)ను కోర్టు దోషిగా నిర్ధారించింది. నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధించింది. ఈ కేసులో నాగోల్ ఎస్ఐ పి. శివ నాగ ప్రసాద్ దర్యాప్తు చేపట్టి, కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి కోర్టులో సమర్పించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శోభారాణి, పి. సత్యనారాయణ వాదనలు వినిపించారు. కేసు విచారణలో నాగోల్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజు, సమన్స్ కానిస్టేబుల్ వెంకటేష్, ఏఎస్సై పి. శోభ సహకరించినట్లు ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ తెలిపారు. బాలలపై నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తును పకడ్బందీగా చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు.


# మొగలాయిలు గోల్కొండ సుల్తానులను ఎదురించి పోరాడిన వీరుడు

- తెలంగాణ బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
- రిటైర్డ్ జిహెచ్ఎం ఎంఈఓ పోచం బావి మహేందర్



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** మొగలాయిలు గోల్కొండ సుల్తానులను ఎదిరించి పోరాడిన తెలంగాణ బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన రిటైర్డ్ జిహెచ్ఎం ఎంఈఓ పోచం బావి మహేందర్. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఉద్దేశించి మాట్లాడుతూ పాపన్న గౌడ్ తెలంగాణ ముద్దుబిడ్డ నాటి వరంగల్ జిల్లా కిల్లా షాపూర్ కోట పై రాజ్యమేలిన వాడు సర్దార్ పాపన్న. యాదగిరి భువనగిరి కోటను పరిపాలించిన మహనీయుడు సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్. మహారాష్ట్రలో చత్రపతి శివాజీ, తెలంగాణలో సమకాలికుడు సర్దార్ పాపన్న గౌడ్ అని కొనియాడారు. గోల్కొండ రాజ్యమును పరిపాలించిన వారు సర్దార్ పాపన్న. అతని జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజలు అందరూ నాటి పాలకులు బహుజన బిడ్డల కష్టాలను గుర్తెరిగి భవిష్యత్ తరాలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను తెలుపవలసిన బాధ్యత ఉందని ఆయన అన్నారు.

# సరస్వతి విద్యాపీఠం వద్ద ఘోర ప్రమాదం.. తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు





**రాజేంద్రనగర్, విశాల భారతి :** వేగంగా దూసుకొచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద ఘటన సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరస్వతి విద్యాపీఠం సమీపంలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాళీ మందిర్ పీబీఈఎల్ సిటీలో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రమేష్ రెడ్డి (40) తన కుమారుడు ఆదిత్‌ను బ్యాడ్మింటన్ క్లాస్‌కు తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వారు సరస్వతి విద్యాపీఠం సమీపంలో వెళ్తుండగా, కిస్మత్‌పూర్ వైపు నుంచి బండ్లగూడ దిశగా వేగంగా వస్తున్న కారు (టీఎస్ 07 జేక్యూ 0009) వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కారు డ్రైవర్ అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాడు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ రమేష్ రెడ్డి మృతి చెందాడు. ఆయన కుమారుడు ఆదిత్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు అతివేగమేనా, లేక ఇతర కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

# హిట్ అండ్ రన్ ఘటనలపై అధికారులకు వినతి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** బండ్లగూడ జాగీర్ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ ఘటనలు, వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని నార్సింగి ట్రాఫిక్ సీఐ ఆంజనేయులు, బండ్లగూడ జాగీర్ సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. 123వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, గత 15 రోజుల్లోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే విషయమని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు కన్వెక్స్ మిర్రర్లు, స్కూల్ జోన్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బీజాపూర్ హైవేపై పాదచారులు రోడ్డు దాటేందుకు అవసరమైన ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రజల భద్రత కోసం అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి మున్సిపల్ శాఖ ద్వారా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన నార్సింగి ట్రాఫిక్ సీఐ ఆంజనేయులు సంబంధిత ట్రాఫిక్ ఆర్ఐకి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సమస్యలపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వెంటనే లేఖ పంపించి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హరీష్‌గౌడ్, రాంప్రసాదరావు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాం రెడ్డి పాల్గొన్నారు.

# మెఫెంటెర్మైన్ ఇంజెక్షన్ల అక్రమ విక్రయాల గుట్టురట్టు

- ముగ్గురు అరెస్ట్.. 110 ఇంజెక్షన్ వయల్స్, 25 సిరంజీలు స్వాధీనం






**రాజేంద్రనగర్, విశాల భారతి:** హైదరాబాద్‌లో మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల అక్రమ విక్రయాల గుట్టును రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. అక్రమంగా ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 110 మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ వయల్స్, 25 వినియోగించిన సిరంజీలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలోని నవాబ్‌సాహెబ్‌కుంటలో పోలీసులు దాడులు నిర్వహించి మహ్మద్ అయాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మెఫెంటెర్మైన్ ఇంజెక్షన్లు, సిరంజీలను స్వాధీనం చేసుకుని విచారించారు. అయాజ్ ఇచ్చిన సమాచారంతో మహ్మద్ జుబేర్ అలియాస్ జుబైర్, మహ్మద్ సైఫ్ ఖాన్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు శుభం రాజ్‌పుత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌ల ద్వారా ఇంజెక్షన్లను ఆర్డర్ చేసి, థర్డ్‌పార్టీ కొరియర్ సర్వీసుల ద్వారా తెప్పించుకుంటున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సుమారు 30 ఇంజెక్షన్ల ప్యాక్‌ను రూ.5 వేలకే కొనుగోలు చేసి, ఒక్కో ఇంజెక్షన్‌ను సుమారు రూ.వెయ్యికి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ అక్రమ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

# కల్యాణలక్ష్మి –షాదీ ముబారక్‌ను కొనసాగించాలి

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన**

**రాజేంద్రనగర్, విశాల భారతి :** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మణికొండ, నెక్నంపూర్ ప్రాంతాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం గండిపేట మండల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాలు ఎంతోమంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆడబిడ్డలకు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కోర్టు తీర్పును సాకుగా చూపుతూ పేదల సంక్షేమ పథకాలకు అన్యాయం చేయడం సరికాదని అన్నారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాలను పటిష్టంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, సుమనళిని, సుమన్, షకీలా రెడ్డి, రేఖ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజల్లో ఉన్న నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు: తుంగతుర్తి రవి**

**మేడిపల్లి విశాల భారతి**




మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రెష్ యాదవ్ పై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను సోమవారం పీర్జాదిగూడ లోని బండి కన్వెన్షన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జలెందర్ రెడ్డి,పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు,దర్గా దయాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తుంగతుర్తి రవి మాట్లాడుతూ, వజ్రెష్ యాదవ్ ఒకసారి ఉప సర్పంచ్‌గా, ఒకసారి సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేసిన వ్యక్తి అని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఓడిపోయినా, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు వజ్రెష్ యాదవ్ అని తెలిపారు. ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచిన వారు తమ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులేనని, ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుల గురించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా బయట నుంచి వచ్చి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ఆరోపణలు నిజమైతే ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడే నాయకుడి గురించి తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం కాదు.. ముందుగా వాస్తవాలు తెలుసుకోవాలి. ఆధారాలు ఉంటే చూపించాలి, లేకపోతే నిరాధార ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి అని తుంగతుర్తి రవి అన్నారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో రంజిత్ కుమార్ రెడ్డి,ముదిగొండ రమేష్, బలరాం,యాసారం నాగేష్,మోహన్ కుమార్, సుదర్శన్ రెడ్డి,మహ్మద్ మజర్,బర్ల నాగరాజు,మణిరం నాయక్, ,జయందర్,రాజ రాజు,మహేష్ గౌడ్,సోమయ్య,శ్రీను నాయక్,సాయిరాం గౌడ్, బొల్గురి నాగరాజు,శరత్ గౌడ్, కపిల్,nnk దుర్గ, తండా పరమేశ్వరి, శ్రీలతతదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి కుంట కట్టకు మోక్షం

**రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నో అబ్జెక్షన్ లెటర్**

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**



హయత్‌నగర్ ప్రజల చిరకాల డిమాండ్‌కు ఎట్టకేలకు ముందడుగు పడింది. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని కుమ్మరి కట్టపై రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఇరిగేషన్ శాఖ నుంచి నో అబ్జెక్షన్ లెటర్ రావడంతో నిర్మాణ పనులకు కీలక అనుమతి లభించినట్లయింది. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఐఏఎస్‌ను కలిసి కుమ్మరి కట్ట అభివృద్ధి అంశంపై చర్చించారు.

**ఇరిగేషన్ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్**

ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ.ఎస్.ఎన్. రెడ్డి నో అబ్జెక్షన్ లెటర్‌ను జోనల్ కమిషనర్‌కు అందజేశారు. అలాగే మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు అవసరమైన ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

**ప్రజలకు రాకపోకల్లో సౌలభ్యం**

కుమ్మరి కట్టపై రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ నిర్మాణంతో పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు**

ఈ ప్రక్రియలో సహకరించిన మల్లేష్, ఈఈతో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులకు గజ్జి భాస్కర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# సోమారంలో కాంగ్రెస్ వర్గపోరు

- ఫ్లెక్సీల వార్‌తో బయటపడ్డ విభేదాలు

**తొర్రూరు, విశాలభారతి:** మండల పరిధిలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. గ్రామంలో జరుగుతున్న శివాలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆహ్వాన ఫ్లెక్సీలు పార్టీలోని రెండు వర్గాల మధ్య తీవ్ర విభేదాలను తెరపైకి తెచ్చాయి.

**ఎమ్మెల్యే ఫోటోలు లేకుండా ఒక వర్గం ఫ్లెక్సీలు**

తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాదరావు వర్గం ఆధ్వర్యంలో గ్రామంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిలో స్థానిక పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఫోటోలు లేకుండా... కేవలం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిల చిత్రాలతోనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

**ఎమ్మెల్యే ఫోటోలతో పోటీగా మరో వర్గం ఫ్లెక్సీలు**

మరోవైపు, డీసీసీ నాయకుడు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోని వర్గం దీనికి పోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. శివాలయ ప్రతిష్ఠాపన ఆహ్వానాల్లో స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, హనుమండ్ల ఝాన్సీ రెడ్డి చిత్రాలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామంలోని ప్రధాన కూడళ్లలో విస్తృతంగా ప్రదర్శించారు. ఆధ్యాత్మిక కార్యక్రమం వేదికగా కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఫ్లెక్సీల యుద్ధానికి దిగడంపై స్థానిక ప్రజలు, రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కేడర్‌లో ఈ విభేదాలు మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

# వందేమాతరం గీతాలాపనతో బీజేవైఎం నిరసన




- వందేమాతర గీతాన్ని ప్రతి భారతీయుడు గౌరవించాలి
- కంబాలపల్లి సతీష్ యాదవ్ బీజేవైఎమ్ జిల్లా అధ్యక్షులు
- పబ్బు వంశీ గౌడ్ బీజేవైఎం మండల అధ్యక్షులు

**చౌటుప్పల్,విశాల భారతి:**

జాతీయ గౌరవాన్ని, దేశభక్తిని చాటుతూ చౌటుప్పల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. జాతీయగీతం "వందేమాతరం" పట్ల కాంగ్రెస్ నాయకులు అవమానకరంగా మాట్లాడారని ఆరోపిస్తూ, బీజేపీ, బీజేవైఎం నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని తంగడిపల్లి రోడ్డులోని నేతాజీ విగ్రహం వద్దకు చేరుకున్న కార్యకర్తలు తొలుత నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేవైఎం మండల అధ్యక్షులు పబ్బు వంశి గౌడ్ ఆధ్వర్యంలో అందరూ ఏకంఠంతో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దేశభక్తి నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ యాదవ్ మాట్లాడుతూ,"స్వాతంత్ర్య సమరంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిన వందేమాతరం గీతాన్ని ప్రతి భారతీయుడు గౌరవించాలి. జాతీయ చిహ్నాలు, జాతీయ గీతాలు రాజకీయాలకు అతీతమైనవి. వాటిని కచ్చితంగా గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమర విలువలను తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్, బీజేపీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణ శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురేష్, చిరంజీవి, పోలేపల్లి లక్ష్మి, ఉడుగు వెంకటేశం, బీజేవైఎం నాయకులు ఉష్కాగుల నాగరాజు, పందుల శరత్ కుమార్, గౌతమ్, ప్రకాష్, కార్తీక్, సన్నీ, నాగరాజు తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొని వందేమాతరంతో దేశభక్తిని చాటుకున్నారు.దేశం పట్ల గౌరవం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

# విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ

- చిలుకూరు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో అవగాహన కార్యక్రమం
- నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సమతుల్య ఎరువుల వినియోగంపై సూచనలు



**మొయినాబాద్, ఆగస్టు 17(విశాలభారతి):** చిలుకూరు క్లస్టర్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్షలు, నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ భూసార పరీక్ష ప్రయోగశాలకు చెందిన వ్యవసాయ అధికారులు ఎం. సునీత, టి. వసంత విద్యార్థులకు భూసార నమూనాల సేకరణ, పరీక్ష విధానం, ఫలితాల ప్రాముఖ్యత, భూసార కార్డుల ఆధారంగా ఎరువుల వినియోగంపై ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి పి. అనురాధ, వ్యవసాయ అధికారి డబ్ల్యూ. దీనా, పాఠశాల ప్రిన్సిపాల్ శౌర్యరాజ్, సైన్స్ ఉపాధ్యాయులు పి. సునీత, జి. సునీల్ పాల్గొన్నారు. 'భూసార పరీక్ష-ఆరోగ్యకరమైన నేల-సమతుల్య ఎరువుల వినియోగం-అధిక దిగుబడులు' అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు.

# సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ నిరసన

- మొయినాబాద్ చౌరస్తాలో భారీ ధర్నా
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్



**మొయినాబాద్, ఆగస్టు 17(విశాలభారతి):** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మొయినాబాద్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. పథకాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరోత్తమ్‌రెడ్డి, ముదిగొండ రవి యాదవ్, అంజయ్యగౌడ్, కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్, మోర శ్రీనివాస్, సురేందర్‌గౌడ్, గడ్డం అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయికుమార్ మృతి బాధాకరం

- నివాళులర్పించిన తుళ్లూరి బ్రహ్మన్న.. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



**అశ్వాపురం, విశాల భారతి :** అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన పాకాలపాటి సాయికుమార్ గొందిగూడెం ఇసుక వాగు సమీపంలోని రైల్వే ట్రాక్ పై మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుళ్లూరు బ్రహ్మన్న అన్నారు. సమస్య ఏదైనాప్పటికీ ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడు క్షణికావేశంలో ఇటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకొని తల్లిదండ్రులకు, కట్టుకున్న భార్యకు తీవ్రమైన శోకాన్ని మిగిల్చాడన్నారు. మృతుడి కుటుంబానికి సాయి లేని లోటు ఎనలేనిదని తుళ్లూరి అన్నారు. సోమవారం ఉదయాన్నే సాయి మృతి వార్త తెలిసిన వెంటనే తీవ్ర దిగ్భ్రాంతికి లోనైనట్లు ఆయన తెలిపారు. చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబానికి తీరనిలోటన్నారు. పోస్టుమార్టం అనంతరం మండల కేంద్రంలోని మృతుడి నివాసానికి వెళ్ళిన ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, సుజాత, పుర ప్రముఖులు ఉన్నారు.

# అనసూర్యమ్మ స్మారకార్థం ముగిసిన సేవా కార్యక్రమాలు

**తొర్రూరు, విశాలభారతి;** తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ మాతృమూర్తి, స్వర్గీయ శ్రీమతి అనసూర్యమ్మ జ్ఞాపకార్థం 'శ్రీమతి అనసూర్యమ్మ ట్రస్ట్' ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల దివ్యస్మరణ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా భారీ అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అనసూర్యమ్మ గారి నిస్వార్థ సేవాభావాన్ని, మానవతా విలువలను కొనియాడారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సేవా మార్గంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ ముగింపు వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు, అభిమానులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని అనసూర్యమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సేవా కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అనసూర్యమ్మ ట్రస్ట్ ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# కల్యాణలక్ష్మిని నిలిపివేసే కుట్రలను తిప్పికొడతాం

- **పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన పథకాన్ని కొనసాగించాలి**
- **కోసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే**

**చౌటుప్పల్,విశాల భారతి:**



కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్షపూరిత వైఖరిని వీడాలి చందూరులో మహిళలతో కలిసి భారీ ధర్నా.. నడిరోడ్డుపై బైఠాయించి నిరసన చందూరు పట్టణ కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిరోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే గొప్ప సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన కల్యాణలక్ష్మి పథకం తొలుత రూ.50 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమై, అనంతరం రూ.1,00,116కు పెరిగి లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిందని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే తల్లిదండ్రులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితిని మార్చేందుకు కేసీఆర్ ఎంతో దూరదృష్టితో ఈ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. తెలంగాణలోని లక్షలాది కుటుంబాల జీవితాల్లో కల్యాణలక్ష్మి వెలుగులు నింపిందని అన్నారు.ఒక నియోజకవర్గంలోనే ప్రతి సంవత్సరం సుమారు 3,500 మంది వరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ఉంటారని, ఇలాంటి పథకం పేదలకు ఎంత అవసరమో దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. పేద కుటుంబాల ఆడబిడ్డలకు అండగా నిలిచిన ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలకు సంబంధించి కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం తరఫున సమర్థవంతంగా న్యాయపోరాటం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. "పేదల కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కోర్టులో పథకం తరఫున బలమైన వాదనలు వినిపించి, పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉంది" అని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున న్యాయవాదులతో కలిసి హైకోర్టులో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

**రాజగోపాల్‌రెడ్డిపై ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు**

స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై కూడా ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి రోజుకో రకమైన ప్రకటన చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఒకరోజు మంత్రి పదవి కావాలని, మరోరోజు పదవులు అవసరం లేదని, ఇంకో రోజు ప్రభుత్వంపై పోరాటం చేస్తానని మాట్లాడుతున్నారని విమర్శించారు. "అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష నేతలా మాట్లాడటం రాజగోపాల్‌రెడ్డికే చెల్లింది. కల్యాణలక్ష్మిపై కోర్టు ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో పేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదు?" అని ప్రభాకర్‌రెడ్డిని ప్రశ్నించినట్లు ఆయన అన్నారు. ప్రజల సమస్యలపై రాజగోపాల్‌రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు.

**బీఆర్ఎస్ హయాంలోనే మునుగోడుకు అభివృద్ధి**

తన హయాంలో మునుగోడు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్, చండూరు రెవెన్యూ డివిజన్లు, మర్రిగూడ, చౌటుప్పల్‌లో ఆసుపత్రులు, పైలాన్ పార్క్, వందల కోట్ల రూపాయలతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మండలాల అంతర్గత రహదారులు, శివన్నగూడెం ప్రాజెక్టు, చండూరులో వివిధ రహదారి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. "మంత్రి పదవి వస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనుకోవడం సరికాదు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రజల కోసం పనిచేసే చిత్తశుద్ధి ఉండాలి. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల సమస్యలే ముఖ్యమని గుర్తించాలి" అని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో తెలంగాణ ప్రజలు, మునుగోడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణకు, రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గానికి అరిష్టంగా మారారని ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా రాజగోపాల్‌రెడ్డికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, పేద కుటుంబాల తరఫున న్యాయ పోరాటం చేయాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాలను కాపాడే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## టియుడబ్ల్యూజే హెచ్143 సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన



**చిట్యాల,విశాల భారతి:** టీయూడబ్ల్యూజే హెచ్ 143 జర్నలిస్టు యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్థానిక జర్నలిస్టుల నుంచి అనూహ్య స్పందన లభించింది. సోమవారం చిట్యాలలో జరిగిన నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము యాదగిరి, శిరిసు రమేష్ స్థానిక జర్నలిస్టులకు సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఎప్పుడూ ముందుంటుందని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మండలంలో జర్నలిస్టులు ఉత్సాహంగా సభ్యత్వాలు తీసుకున్నారని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు పూర్తయిన వెంటనే నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామని వారు వెల్లడించారు. టియుడబ్ల్యూజే హెచ్ 143 చిట్యాల మండల అధ్యక్షుడు రేగొండ వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుస శ్రీనివాస్, కార్యదర్శి మూడ వేణు, టీఎంజెయు నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లూరి శ్రీకాంత్, యూనియన్ ప్రధాన కార్యదర్శి చెన్నోజు చంద్రశేఖర్, కార్యదర్శి మూడ వెంకటాద్రి, నాయకుడు జిట్ట నరేష్, మాజీ అధ్యక్షుడు కారంపూడి మధు, గుండ్లపల్లి వెంకన్న, దేశినేని సాయికుమార్, అంతటి నాగరాజు గౌడ్, పల్లపు ప్రశాంత్, కొమిడాల మహేందర్ రెడ్డి, పెద్దబోయిన ఆనంద్ కుమార్, ఎడపాక శంకర్, మందడి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతపై అవగాహన కల్పించిన డీసీపీయు, స్కోప్ ఎన్జిఓ




**చౌటుప్పల్, విశాల భారతి:** మండలం మల్కాపురం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ఆదివారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయు) మరియు స్కోప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "గుడ్ టచ్ - బ్యాడ్ టచ్" మరియు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ, నేటి సమాజంలో మత్తు పదార్థాల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు వాటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు జరిగితే ఫోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. బాల కార్మిక వ్యవస్థ దుష్పరిణామాలు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ మధ్య తేడా గురించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. అత్యవసర సమయంలో సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 మరియు 112 నెంబర్లను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. కార్యక్రమం చివర్లో విద్యార్థుల చేత బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్లతో కూడిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెడ్మాస్టర్ ఆర్. శోభ మేడం, స్కోప్ ఎన్జిఓ ప్రతినిధి బి. నరసింహ రాజు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం విజయ్ సెంచరీ కొట్టేశారు




**విశాలభారతి, తమిళనాడు:** తమిళనాడు రాజకీయ చరిత్రలో నూతన శకానికి తెరతీస్తూ... ముఖ్యమంత్రిగా విజయ్ తన పాలనలో విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకున్నారు. దశాబ్దాలుగా రెండు ప్రధాన పార్టీల మధ్యే నడిచిన రాజకీయాన్ని మారుస్తూ, ప్రజానాయకుడిగా బాధ్యతలు చేపట్టిన విజయ్... తన తొలి వంద రోజుల్లోనే సంచలన నిర్ణయాలతో యావత్ దేశం దృష్టిని ఆకర్షించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలపై సీఎం విజయ్ దృష్టి పెట్టారు. గృహ వినియోగదారులకు ప్రతి రెండు నెలలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా సింగపెన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, అలాగే విద్యాసంస్థలు, ఆలయాల సమీపంలో ఉన్న 717 టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేయడం వంటి కీలక ఫైళ్లపై తొలి రోజే సంతకాలు చేశారు. రైతన్నల సంక్షేమం కోసం రూ. 6,000 కోట్ల వరకు పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు, సన్నకారు రైతులకు పెద్దపీట వేశారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఆసుపత్రులలో జన్మించే శిశువులకు బంగారు ఉంగరం అందించే 'తాయ్ మామన్ తంగ మోతిరం' పథకం, వివాహ కానుకగా బంగారు నాణెం, పట్టు చీరల పథకాలను ప్రకటించారు. యువత నైపుణ్యాభివృద్ధికి, విద్యార్థులకు లాప్‌టాప్‌లు సైకిళ్ల పంపిణీకి పెద్దఎత్తున నిధులు కేటాయించారు. కేవలం సంక్షేమమే కాకుండా, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా 'వెట్రి తమిళ నాడు' ఇన్వెస్టర్స్ కాంక్లేవ్ ద్వారా ఏకంగా లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం విజయవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తావులేకుండా, పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమని విజయ్ స్పష్టం చేశారు.ప్రజలే పాలకులు, మేం కేవలం సేవకులమే అంటున్న ముఖ్యమంత్రి విజయ్ ప్రయాణంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.




## రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో లక్షలాదిమంది ఉన్నత విద్యను అభ్యసించిన వారికి నిరుద్యోగ కోరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైందన్నారు. 2014లో మోడీ సర్కార్ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 12 ఏండ్లు గడుతున్నప్పటికీ ఉద్యోగాలు కల్పించకుండా యువతను మోసం చేస్తున్నారు. కేంద్ర మంతృత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఐటి రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చలేదు. మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడమే తప్ప కొత్త రిక్రూట్మెంట్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు కనిపిస్తామని అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడుస్తున్నా 62 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందన్నారు. 20వేల కానిస్టేబుల్ పోస్టులకు ఖాళీలు ఉంటే 7వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం అన్ని ప్రభుత్వ శాఖలో సుమారు 9వేల మంది పదవి విరమణ పొందుతున్నారు. తెలంగాణలో 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 11వేల కోట్ల స్కాలర్ షిప్ లను విడుదల చేయాలి. ఈనెల 20న నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నిర్వహించే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, కందుకూరి జగన్, జిల్లా కమిటీ సభ్యులు చాతళ్ల జంగయ్య, బుగ్గరాములు, అంజయ్య, రావుల జంగయ్య, కిషన్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, నాయకులు విజయమ్మ, ఇందిరా,స్వప్న, ఆనంద్, శంకర్, నర్సింహ, చందు నాయక్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జంగయ్య, గజ్జల మహేష్, లింగం, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్, శ్రీకాంత్, మణి, బన్నీ, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విజ్ఞప్తికి స్పందించిన అదనపు కలెక్టర్

- **డంపింగ్ యార్డ్ పనులు నిలిపివేయాలని కమిషనర్ కు చరవాణి ద్వారా ఆదేశం**
- **ఇది గ్రామ ప్రజల సమిష్టి విజయం.. సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్**



**చౌటుప్పల్,విశాల భారతి:** ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అంకిరెడ్డిగూడెం గ్రామ ప్రజలు చేసిన సంయుక్త వినతికి జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించింది. యాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, లింగోజిగూడెం రెవెన్యూ పరిధి అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 326లో, స్మశాన వాటిక ప్రక్కన కట్ట నుండి కాంశెట్టి పెంటయ్య బావి నుండి మైనార్టీ స్కూల్ వెనుక భాగం వరకు ఉన్న స్థలంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ చెత్తను డంపింగ్ చేయడానికి నిర్మాణాలు చేపట్టడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ స్థలం మైనార్టీ స్కూల్, జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ మరియు రెండు గ్రామాలకు అతి సమీపంలో ఉండడంతో, సుమారు 600 మంది విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువకులు మరియు వివిధ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా ఏకమయ్యారు.

**గ్రీవెన్స్ డేలో వినతి:** అంకిరెడ్డిగూడెం సర్పంచ్, సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల్ అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బృందం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ ని మరియు జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, జనావాసాలకు, పాఠశాలలకు కనీసం 2 కిలోమీటర్ల దూరంలో వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

**అదనపు కలెక్టర్ చొరవ:** వినతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు (స్థానిక సంస్థలు) వెంటనే చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ తో చేరవాణి ద్వారా మాట్లాడారు. పాఠశాలలో 600 మంది పిల్లలు ఉన్న విషయాన్ని తెలియజేస్తూ అక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాట్లను నిలిపివేయాలని ఆదేశించారు.

**కలెక్టర్ హామీ:** ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, డంపింగ్ యార్డ్ ను తప్పనిసరిగా ఇతర ప్రాంతానికి తరలిస్తామని, రెండు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విజయం ఏ ఒక్కరిది కాదని అంకిరెడ్డిగూడెం గ్రామ ప్రజల అందరికి సమిష్టి కృషి ఫలితమే ఈ విజయమని ఆయన తెలిపారు. గ్రామ సమస్యలపై ఇదేవిధంగా కలిసికట్టుగా పోరాడితే సాధ్యం కానిది అంటూ ఏదీ ఉండదని, ఐక్యమత్యమే మహాబలం అని మరొకసారి నిరూపణ జరిగిందని ఆయన తెలిపారు. పిలుపుమేరకు ఈ సమస్యపై వెంటనే స్పందిస్తూ కలిసికట్టుగా పని చేసిన గ్రామంలోని వివిధ పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్ల అండాలు, రాపోలు రేణుక, బొమ్మని శ్రావణి, స్వామి గౌడ్, సుర్వి సత్తయ్య గౌడ్ మాజీ సర్పంచ్, యాట శంకరయ్య, బోడెపు లక్ష్మయ్య గౌడ్ తో పాటు గ్రామ యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లింగోజిగూడెంలో డంపింగ్ యార్డ్ వద్దు



- **జనావాసాలకు దూరంగా తరలించాలని కమిషనర్కు వినతి**
- **కడారి కల్పన ఐలయ్య యాదవ్ బిజెపి పట్టణ అధ్యక్షులు**

**చౌటుప్పల్,విశాల భారతి:**

మండలం లింగోజిగూడెం గ్రామంలో సర్వే నెం. 326లో మున్సిపల్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చెత్త డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేసి నిర్మాణస్యమైన ప్రాంతాల్లో వేయాలని బిజెపి చౌటుప్పల్ పట్టణ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం కడారి కల్పనా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, స్మశాన వాటిక పక్కన, కామ్శెట్టి పెంటయ్య బావి నుండి బిస్కెట్ల కంపెనీ వెనుక వరకు ఉన్న స్థలంలో చెత్త డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు ప్రారంభించారని,ఈ ప్రదేశానికి 500 మీటర్ల దూరంలోనే మైనారిటీ స్కూల్ మరియు లింగోజిగూడెం హైస్కూల్ ఉన్నాయి.రోజూ దాదాపు 1000 మంది విద్యార్థులు దుర్వాసన మధ్య చదువుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త కుప్పల వల్ల దోమలు, ఈగలు పెరిగి మలేరియా, డెంగ్యూ, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా చెత్త నుండి వచ్చే కలుషిత నీరు భూగర్భంలోకి చేరి గ్రామ బోర్లు, బావుల నీటిని కలుషితం చేస్తుందని, వ్యవసాయ పంటలు, పశు సంపదకు నష్టం వాటిల్లుతుందని, చుట్టుపక్కల భూముల ధరలు పడిపోతాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, జనావాసాలకు, పాఠశాలలకు కనీసం 2 కిలోమీటర్ల దూరంలో వేరే ప్రాంతానికి తరలించాలని గ్రామ యువకులు, మహిళలు, రైతులు, వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా డంపింగ్ యార్డ్‌ను వెంటనే వేరే చోటుకు మార్చాలి ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు దూడల బిక్షం గౌడ్, కౌన్సిలర్ బుద్ధా సురేష్, కడారి ఐలయ్య, ఊడుగు వెంకటేశం గౌడ్, ఎర్ర నర్సయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, ఉష్కాగుల నాగరాజు గౌడ్, కాసుల వెంకటేశం, వనం ధనుంజయ, పాండు, ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, భాను ప్రకాష్, దిండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బంచరాయితండలో అంబరాన్నంటిన తీజ్ సంబరాలు

- **మాలు సాదు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా తీజ్ పండుగ సంబరాలు**
- **బంజారాల సంప్రదాయానికి ప్రతీకగా ప్రత్యేక తీజ్ పండుగ**
- **గంగమ్మ ఒడిలోకి చేరుకున్న తీజ్.. ఘనంగా నిమజ్జనం**
- **ముఖ్యఅతిథి మహబూబాబాద్ ఆర్‌సీఓ నారాయణ నాయక్**
- **ఆర్ సి ఓ నారాయణ నాయక్‌ను బంజారా పాపిడి కట్టిన బానోత్ దేవేందర్ నాయక్**

**కురవి విశాల భారతి:**






బంజారాల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ సంబరాలు మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని బంచరాయితండలో అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులపాటు కొనసాగిన తీజ్ వేడుకలకు ముగింపు సందర్భంగా తీజ్ మొలకలను గంగమ్మ ఒడిలోకి నిమజ్జనం చేసే కార్యక్రమాన్ని బంజారా సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించారు. బంజారా యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొనడంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా ఆర్‌సీఓ నారాయణ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహబూబాబాద్ జిల్లా ఆర్ సి ఓ నారాయణ నాయక్ ను బంజారా పాకడి ని కట్టి బానోత్ దేవేందర్ నాయక్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఇలాంటి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బానోత్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, తీజ్ పండుగ తొమ్మిది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలతో కొనసాగుతుందని, తొమ్మిదో రోజు తీజ్ మొలకలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ముఖ్యంగా పెళ్లికాని గిరిజన యువతులు తీజ్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఒక ప్రత్యేకమైన పండుగగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**బోరడి ఝుప్కెరో.. తీజ్ పండుగలో ప్రత్యేక ఘట్టం.**

ఈ సందర్భంగా మాలు సాదు మాట్లాడుతూ... తీజ్ పండుగలో బోరడి ఝుప్కెరో కార్యక్రమం ఒక ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుంది. బోరడి అంటే రేగు ముళ్లు, ఝుప్కెరో అంటే గుచ్చడం అని అర్థం. బుట్టల్లో గోధుమలను పెంచి, ప్రత్యేక సంప్రదాయ పద్ధతిలో బోరడి ఝుప్కెరో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం బంజారా సంస్కృతిలోని ప్రత్యేకతను చాటిచెబుతుంది.

**ధమోళి చుర్మో.. భక్తిశ్రద్ధలతో సమర్పణ.**

**సుధాకర్ నాయక్ మాట్లాడుతూ...**

తీజ్ పండుగలో ధమోళి చుర్మో కార్యక్రమాన్ని కూడా ప్రత్యేకంగా నిర్వహిస్తారు. బియ్యం పిండితో రొట్టెలు తయారు చేసి, వాటికి బెల్లాన్ని కలిపి ముద్దగా చేసి మేరమా భవాని అమ్మవారికి సమర్పిస్తారు. బంజారా మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

**గాన్ గోర్ పూజ.. కొంచెం దుఃఖం.. మరికొంచెం ఆనందం**

ఈ సందర్భంగా కిసాన్ నాయక్ మాట్లాడుతూ... తొమ్మిదో రోజు గాన్ గోర్ పూజ తీజ్ వేడుకల్లో మరో ప్రధాన ఘట్టంగా ఉంటుంది. బంజారాల ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను మట్టితో తయారు చేసి పూజలు నిర్వహించి, డోక్ర-డోక్రి ప్రతిరూపాలకు వివాహం జరిపిస్తారు. పెళ్లికాని ఆడపిల్లలు తమను డోక్రిలుగా ఊహించుకుంటూ ఈ సంప్రదాయంలో పాల్గొంటారు. వివాహం అనంతరం తమ వంటింటిని, కుటుంబాన్ని వదిలి వెళ్లాల్సి వస్తుందనే భావనతో వారు దుఃఖిస్తూ కన్నీరు పెట్టుకోవడం, వారిని సోదరులు ఓదార్చడం ఈ సంప్రదాయంలో ప్రత్యేకతగా ఉంటుంది. బావ వరుస వారు ఆటపట్టిస్తూ కొంత దుఃఖం, మరికొంత ఆనందంతో వేడుకను కొనసాగిస్తారు. తొమ్మిదో రోజు బంజారా సంప్రదాయ పద్ధతుల్లో తీజ్ పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తీజ్ నిమజ్జనానికి బంధుమిత్రులు, గ్రామస్తులను ఆహ్వానించి, కొత్త బట్టలు ధరించి మేరమా భవాని, సేవాభాయ (సేవాలాల్)లకు అత్యంత పవిత్రంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పున్నం, రామారావు, తేజ్యా నాయక్, సర్పంచ్ బాదావత్ కమ్లి పుల్య, ఉప సర్పంచ్ భూక్యా కల్పన భరత్, రంజిత్, కృష్ణ, గ్రామ వాసులు ఆప్పు, బాలు, బిచ్చ ఫిష్ వినోద్ కుమార్, సాదు, మోహన్, అశోక్, ధను, లింగు, తదితరులు పాల్గొన్నారు.



# నిధి అగర్వాల్ కొత్త చిత్రం

నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వరాహ్ ఫిల్మ్స్ పతాకంపై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. 'మైథాలజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నిధి అగర్వాల్ పాత్ర మునుపెన్నడూ చూడని విధంగా కొత్త పంథాలో ఉంటుంది.మహిళా ప్రధాన ఇతివృత్తంతో అందరిని ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు అన్నారు. ఈ సినిమా తాలూకు టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.